
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి
జిల్లా వార్తలు

ఆదివారం 21 జూలై 2024

మత్తుకు బానిసవుతున్న యువత

తిరుపతి, పరిసరాల్లో ప్రమాదకరంగా పరిస్థితులు

హైస్కూలు విద్యార్థులకూ అందుతున్న పొట్లాలు

చోరీల నుంచీ హత్యల దాకా పెరుగుతున్న నేరాలు

పేట్రేగుతున్న గంజాయి బ్యాచ్‌లు

రెండున్నరేళ్ళలో కేసుల వివరాలు

ఏడాది	కేసులు	నిందితులు	పట్టుబడిన గంజాయి
2022	72	207	527 కిలోలు
2023	108	489	1203 కిలోలు
2024	40	120	230 కిలోలు
మొత్తం	220	806	1960 కిలోలు



ప్రధాన పట్టణాల్లో యథేచ్ఛగా సంచారం

తిరుపతి సహా జిల్లాలోని ప్రధాన పట్టణాల నడిబొడ్డు నుంచీ శివార్ల దాకా గంజాయి బ్యాచ్‌లు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. చాటుగా కాస్తంత ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ మకాం వేసి గంజాయి సేవిస్తున్న యువకులే కనిపిస్తున్నారు. ముళ్ళపొదలు, చెట్లు గుబురుగా వున్న చోట్ల, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు మొదలుకుని స్మశానాల దాకా గుంపులు కట్టి అగుపిస్తున్నారు. మాసిన దుస్తులు, చింపిరి జుట్లతో మత్తులో జోగుతూ చూడడానికే భయం గొలిపేలా అనిపించే యువకులు తిరుపతిలోని పోష్ కాలనీల్లో కూడా ప్రత్యక్షమవుతున్నారు. ప్రశాంతతకు అలవాటు పడిన అలాంటి కాలనీవాసులను గంజాయి బ్యాచ్‌ల వాలకం భయపెడుతోంది. రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్ల వద్ద రాత్రిళ్ళు మకాం వేసి ప్రయాణీకులను దోచుకోవడం, బెదిరించడం, దాడులకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఈ ముఠాలను గత ఐదేళ్ళలో అధికార పార్టీ నేతలు కొందరు చేరదీసి తమ దౌర్జన్యాలకు వాడుకుంటూ ప్రోత్సహించారన్న ఆరోపణలున్నాయి. అప్పట్లో అధికార పార్టీ నేతల అండతోనే గంజాయి బ్యాచ్‌లు ఎవరినీ లెక్కచేయని స్థితికి చేరాయనే ఆరోపణలు కూడా వున్నాయి.

పోలీసులు గుర్తించిన హాట్ స్పాట్‌లు

జిల్లావ్యాప్తంగా గంజాయి విక్రయాలు సాగించడంతో పాటు వినియోగించే హాట్ స్పాట్‌లను పోలీసు, సెబ్ విభాగాలు గుర్తించాయి.తిరుపతి నగరంలో.... కేశవాయన గుంట, జీవకోన, ఎస్టీ నగర్, బీటీఆర్ కాలనీ, డీబీఆర్ రోడ్డు, శ్రీదేవి కాంప్లెక్స్, బాలాజీ కాలనీ, పేరూరు, మార్కెట్ ఏరియా, మంగళం.శ్రీకాళహస్తిలో... ఏఎంపల్లి, ఎంఎం వాడ, రాజీవ్ నగర్, బాబూ అగ్రహారం, జైహింద్ కాలనీ.చంద్రగిరిలో...అగరాల,ఐతేపల్లి, రంగంపేట క్రాస్, కొంగరవారిపల్లి.గూడూరులో... గూడూరు అరుంధతివాడ, బస్టాండు, రైల్వే స్టేషన్, అండర్ బ్రిడ్జి.వెంకటగిరి పట్టణంలో పలు ప్రాంతాలు, బస్టాండు.నాయుడుపేట పట్టణంలోని పలు ప్రదేశాలు, బస్టాండు



తిరుపతి తిమ్మినాయుడు పాలెంలోని గోదాదేవి మార్గం పక్కన గంజాయి ముఠా మకాం వేసే ప్రదేశం



తిరుపతిలోని జీవకోన మొండోడి కోన వద్ద గంజాయి ముఠా మకాం వేసే ప్రదేశం

తిరుపతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గంజాయికి అలవాటు పడ్డ బ్యాచ్‌లు జిల్లాలో పెట్రేగిపోతున్నాయి. మత్తులో చిన్న పాటి చోరీలు మొదలుకుని హత్యల దాకా తెగబడుతున్నాయి. తమలో తాము ఘర్షణలకు దిగడంతో పాటు దారిన వెళ్ళే జనంపైనా, వాహనాలపై కూడా దౌర్జన్యాలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నాయి. పోలీసు, సెబ్ విభాగాలు ఎంతసేపూ గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం తప్పితే గంజాయి సేవించి నేరాలకు అలవాటుపడుతున్న ముఠాలపై దృష్టి సారించడం లేదు. రెండు మూడేళ్ళుగా హైస్కూలు స్థాయి విద్యార్థులు, ఆ వయసు పిల్లలు కూడా గంజాయికి అలవాటు పడుతుండడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఏడాదిగా ఆ జాబితాలో బాలికలు సైతం చేరుతుండడం కలవరం కలిగిస్తోంది. గత ఐదేళ్ళుగా గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగాన్ని నిరోధించే విషయంలో సంబంధిత యంత్రాంగాలు నిర్లక్ష్యం వహించిన పర్యవసానం ఇపుడు జిల్లాను ప్రమాదం వైపు నెట్టేస్తోంది.

గంజాయి బ్యాచ్‌ల అరాచకాలు

- సత్యవేడులో గతేడాది గుజరీ దుకాణంలో దొంగతనానికి యత్నించిన వ్యక్తి అలికిడికి నిద్ర లేచిన యజమానిని హతమార్చి పరారయ్యాడు. నిందితుడు పట్టుబడ్డాక గంజాయి మత్తులో హత్యకు పాల్పడినట్టు విచారణలో వెల్లడైంది.
- రేణిగుంటలో గత నెల గంజాయి మత్తులో ఇద్దరు ఘర్షణకు దిగడంతో ఒకరు కత్తిపోట్లకు గురయ్యారు.
- సూళ్ళూరుపేటలో గంజాయి మత్తులో యువత వీధుల్లో బైక్‌లపై వేగంగా దూసుకెళుతూ ఈలలు, కేకలు వేస్తూ తిరుగుతుంటారు. ఇదివరకూ గంజాయి బ్యాచ్‌లు పరస్పరం కత్తులతో దాడులు చేసుకున్న ఘటనలు రెండు మూడు సార్లు జరిగాయి.
- నాయుడుపేట పట్టణం బీడీ కాలనీలో ఇటీవల గంజాయి మత్తులో ఓ యువకుడు బీరు బాటిల్‌తో మరో యువకుడిపై దాడికి పాల్పడ్డాడు.
- తిరుపతి ఆర్టీసీ బస్టాండులో రోజూ కనీసం 500 ద్విచక్ర వాహనాలు పార్కు చేస్తుంటారు. పనులపై బయట ప్రాంతాలకు వెళ్ళి రాత్రిళ్ళు తిరిగొచ్చి బైక్‌లు తీసుకుని ఇళ్ళకు వెళుతుంటారు. అయితే ఇందులో కనీసం వందమందైనా గంజాయి బ్యాచ్‌ల బాధితులున్నారని బస్‌స్టేషన్ అధికారులే చెబుతున్నారు. గంజాయి మత్తులో రాత్రిళ్ళు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ప్రయాణీకులపై దాడులకు దిగడంతో పాటు బ్యాగులు, నగదు కూడా గుంజుకుంటున్న పరిస్థితులు వున్నాయని చెబుతున్నారు.
- ఏర్పేడు వ్యాసాశ్రమం సమీపాన రెండు నెలల కిందట గంజాయి మత్తులో యువకులు పరస్పరం దాడులకు దిగి ఘర్షణ పడ్డారు.
- శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ వద్ద గతేడాది గంజాయి మత్తులో కొందరు యువకులు ఇద్దరు ప్రయాణీకుల నుంచీ సెల్‌ఫోన్లు లాక్కుని పరారయ్యారు.
- తిరుపతి మంగళంలో ఇటీవల గంజాయి సేవించిన ఇద్దరు యువకులు రోడ్డుపైకి చేరి వాహనాలను అడ్డుకున్నారు. ఓ విద్యా సంస్థ బస్సుపై రాళ్లతో దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. బస్సులో పిల్లలపై దాడికి యత్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

ప్రమాద ఘంటికలు

తిరుపతిలో గంజాయి సేవిస్తున్న వారి సంఖ్య 4 వేల దాకా వుంటుందని అంచనా. వీరిలో హైస్కూలు స్థాయి విద్యార్థులు కూడా వున్నారని సమాచారం. చంద్రగిరిలో విద్యాసంస్థలు అధికంగా వుండడంతో విద్యార్థులు, యువకులు వందలసంఖ్యలో గంజాయి మత్తుకు అలవాటు పడ్డారనే సమాచారం వుంది. గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వారిలో పలువురు విద్యార్థులు కూడా వున్నట్టు గుర్తించారు. చంద్రగిరిలో హైస్కూలు బాలికకు కొందరు గంజాయి అలవాటు చేశారని తల్లిదండ్రులే పోలీసులకు ఫిర్యాదు చేయడం, దానిపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సైతం స్పందించి ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రేణిగుంటలో వ్యసనపరుల సంఖ్య 200 వుండగా అందులో హైస్కూలు విద్యార్థులు కూడా వుండడం కలవరం కలిగిస్తోంది. ఓ విద్యార్థి గంజాయి కూర్చిన సిగరెట్ తాగుతుండగా పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు సమాచారమిచ్చి కౌన్సిలింగ్ ఇచ్చిన సంఘటన జరిగింది. గంజాయి సేవిస్తున్న కారణంగా ఇటీవల ప్రైవేటు పాఠశాలలు కొందరు విద్యార్థులకు టీసీలు ఇచ్చి ఇళ్ళకు పంపించడం, దీనిపై పిల్లల తల్లిదండ్రులు గొడవకు దిగిన ఉదాహరణలూ వున్నాయి. ఈ పరిణామాలను ప్రమాద ఘంటికలుగా పరిగణించి తక్షణం నియంత్రణా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత పోలీసు, సెబ్ విభాగాలపై వుంది. రవాణాను, విక్రయాలను అరికట్టడంతో పాటు వినియోగిస్తున్న వారిపైన, వారి కదలికలపై దృష్టి పెట్టి కఠినంగా నియంత్రించాల్సిన అవసరముంది.

గంజాయి మత్తులో చేసిన నేరాలపై 12 కేసులు

గత రెండున్నరేళ్ళలో గంజాయి మత్తులో హత్యలు, హత్యా యత్నాలు, దాడులు, ఘర్షణలకు పాల్పడిన ఘటనలపై జిల్లావ్యాప్తంగా 12 కేసులు నమోదయ్యాయి. గంజాయి సేవించి ఆ మత్తులో చిన్నపాటి గొడవలు, ఘర్షణలు, దౌర్జన్యాలకు దిగిన ఘటనలు అసంఖ్యాకంగా వున్నాయి. అయితే వాటిపై చాలావరకూ పోలీసులకు ఫిర్యాదులు అందడం లేదు. అందినా కేసులు నమోదు కావడం లేదు. నమోదైన 12 కేసులే నేరాల్లో గంజాయి పాత్ర ఏ పాటిదో తేటతెల్లం చేస్తున్నాయి.

ఈ సర్కిళ్ళలో గంజాయి కేసులు అధికం

గత రెండున్నరేళ్ళలో నమోదైన కేసులను పరిశీలిస్తే 2022లో అత్యధికంగా సూళ్ళూరుపేటలో 15, గూడూరులో 14 చొప్పున నమోదయ్యాయి. ఆ ఏడాది సెబ్ విభాగం పెట్టిన మొత్తం 37 కేసుల్లో 29 కేసులు ఈ రెండు సర్కిళ్ళలోనే వుండడం గమనార్హం. 2023లో కూడా గూడూరులో 20, సూళ్ళూరుపేటలో 10 చొప్పున అత్యధికంగా కేసులు నమోదు చేశారు. ఒడిశా, ఛత్తీస్ ఘడ్, ఉత్తరాంధ్రలోని విశాఖ తదితర ప్రాంతాల నుంచీ అక్రమంగా చెన్నైకి తరలించే క్రమంలో గూడూరు, సూళ్ళూరుపేట సర్కిళ్ళలో గంజాయి ఎక్కువగా పట్టుబడుతోంది.

గంజాయి బ్యాచ్‌ల అడ్డాలు

తిరుపతిలో మంగళం బీటీఆర్ కాలనీ సమీపం, చంద్రబాబు కాలనీ, వెంకటేశ్వర కాలనీ, మిట్ట గాంధీపురం స్మశానం సమీప ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు తరచూ మకాం వేసి గంజాయి సేవిస్తూ వుంటాయి.జీవకోన ప్రాంతం మొండోడి కోన వద్ద గంజాయి బ్యాచ్ తరచూ మకాం వేస్తుంటుందని, అక్కడే గంజాయి సేవిస్తుంటాందని స్థానికులు చెబుతున్నారు.జీవకోన మున్సిపల్ వాటర్ ట్యాంక్ సమీపంలోని స్మశానం వద్ద నిత్యం పలువురు గుంపులు గుంపులుగా గంజాయి, మద్యం సేవిస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా మద్యం సీసాలే కనిపిస్తున్నాయి.రుయా ఆస్పత్రి ఎదుట అలిపిరి వెళ్ళే మెయిన్ రోడ్డుకు ఇరువైపులా యాచకులు నిత్యం గంజాయి మత్తులో తూలుతూ కనిపిస్తుంటారు. కొందరు యువకులు ఇక్కడికే వచ్చి వారికి గంజాయి విక్రయించి వెళుతుంటారు. ఆ ప్రాంతంలోని కొన్ని బడ్డీషాపుల్లో కూడా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

ఈ ఏడాదిలో కేసులు ఎందుకు తగ్గాయంటే...

ఈ ఏడాదిలో పోలీసు, సెబ్ విభాగాలు నమోదు చేసిన గంజాయి కేసుల సంఖ్య చాలా తక్కువగా వున్నాయి. గత ఫిబ్రవరి నుంచీ మే నెలాఖరు వరకూ గంజాయి కేసులు నమోదు చేయవద్దని ఉన్నత స్థాయి నుంచీ మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. ఎన్నికల సమయం కావడంతో గంజాయి పట్టుబడితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, ఎన్నికల్లో అధికార పార్టీపై ప్రభావం చూపుతుందన్న కారణంగా ఈ ఆదేశాలు వెలువడినట్టు తెలిసింది. అందువల్లే ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ నమోదైన కేసుల సంఖ్య గత రెండేళ్ళతో పోలిస్తే చాలా తక్కువగా వుంది.

సర్పాల సయ్యాట





గూడూరు తహసీల్దారు కార్యాలయ సమీపంలో శనివారం సాయంత్రం రెండు పాములు సయ్యాట లాడుతూ కన్పించాయి.మీసేవ కార్యాలయ ఆవరణలో గంటకు పైగా రెండు పాములు ఒకదానితో ఒకటి పెనవేసుకుని పెనుగులాడుతుండడాన్ని వెలుగు, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది గమనించారు. అయితే కార్యాలయాల ఆవరణలో ఇలా విషసర్పాల సంచారంపై వారంతా భయాందోళనకు లోనవుతున్నారు. - గూడూరు

జేసీగా శుభం బన్సల్

తిరుపతి కమిషనర్‌గా మౌర్య



శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్)/తిరుపతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్ మరోసారి నియమితులయ్యారు. ప్రస్తుతం మన్యం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న శుభం బన్సల్ గత యేడాది డిసెంబరు 23 నుంచి మార్చి 16 వరకు తిరుపతి జేసీగా పనిచేశారు.మూడు నెలల్లోనే శాప్ ఎండీగా బదిలీపై వెళ్లారు.తిరిగి శ్రీవారి పాదాల చెంత జేసీగా పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.కాగా ప్రస్తుత జేసీ హెచ్ఎం ధ్యానచంద్ర విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.ఎన్నికల సమయంలో తిరుపతికి వచ్చిన తాను సీనియర్ అధికారుల నుంచి ఎంతో నేర్చుకున్నానని ధ్యానచంద్ర చెప్పారు.తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నారపురెడ్డి మౌర్య నియమితులయ్యారు.కర్నూలు జాయింట్ కలెక్టర్‌గా ఉన్న ఆమె తిరుపతి కమిషనర్‌గా బదిలీపై రానున్నారు.2020 బ్యాచ్‌కు చెందిన మౌర్యకు గత ఏడాది ఏప్రిల్లోనే తిరుపతి కమిషనర్‌గా అవకాశం వచ్చింది. ప్రసూతి సెలవులో ఉన్న ఆమెను తిరుపతి కమిషనర్‌గా అప్పటి వైసీపీ ప్రభుత్వం నియమించింది. అయితే చివరి నిమిషంలో ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ హరితను కమిషనర్‌గా నియమించింది. కొత్త ప్రభుత్వంలో ఏడాది తర్వాత మళ్లీ తిరుపతి కమిషనర్‌గా ఆమెకు అవకాశం దక్కడం గమనార్హం.కాగా ప్రస్తుత కమిషనర్ అదితిసింగ్ కడప జాయింట్ కలెక్టర్‌గా బదిలీఅయ్యారు.దాదాపు 6 నెలలు పాటు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆమె వచ్చీరాగానే దొంగ ఓట్ల ఏరివేతపై పెద్ద కసరత్తు చేశారు. ఎన్నికల నిర్వహణలోనూ క్రియాశీలకంగా పనిచేశారు.



మౌర్య

రేపటినుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

తిరుపతి(విద్య), జూలై 20: జాతీయ విద్యావిధానం 4వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడమే ఆశయంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిందన్నారు. విజయవంతంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులను భాగస్వాములను చేయాలని సూచించారు. తొలి రోజైన 22న స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శన. 23న అభ్యసన, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యంపై అవగాహన. 24న క్రీడా పోటీలు. 25న సాంస్కృతిక కార్యక్రమాలు. 26న సాంకేతిక విద్యపై ఆసక్తిని కల్పించడం. 27న పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యం, అమ్మకు అంకితం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 28న స్థానికులు, పేరెంట్స్ కమిటీలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలతో సహపంక్తి భోజనం ఉంటాయి.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌పై కేసు

రేణిగుంట,జూలై 20: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ శోభారాణిపై కేసు నమోదయ్యింది.రిజిస్ట్రార్ కార్యాల యం లో స్టాంపుల ద్వారా వచ్చిన రూ.21.51 లక్షల సొమ్మును ప్రభుత్వ ట్రెజరీకి చెల్లించకపోవడం గుర్తించిన జిల్లా రిజిస్ట్రార్ కమలాకర్ గతంలో సబ్ రిజిస్ట్రార్ శోభారాణితో పాటు సీనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.అంతేకాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 16న ఫిర్యాదు చేశారు.దీంతో సబ్ రిజిస్ట్రార్ శోభారాణి,సీనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్‌పై కేసు నమోదయ్యింది.



బస్సును ప్రారంభించి, నడుపుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరిలో ఆర్టీసీ టౌన్ బస్సులు పునఃప్రారంభం

చంద్రగిరి, జూలై 20: చంద్రగిరిలో ఆర్టీసీ టౌన్ సర్వీస్ బస్సులు పునః ప్రారంభమయ్యాయి. ఐదేళ్లుగా చంద్రగిరి- రేణిగుంట మధ్య తిరుగుతున్న టౌన్ బస్సులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో మళ్లీ టౌన్ సర్వీసులు పునరుద్ధరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టౌన్ సర్వీసులు నిలిపివేశారని, టీడీపీ అధికారంలోకి రాగానే ప్రారంభించినట్లు చెప్పారు. చంద్రగిరి- రేణిగుంట మధ్యే కాకుండా పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట వరకు ఆర్టీసీ బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం బస్సును ఆర్టీసీ బస్టాండు నుంచి జాతీయ రహదారి వరకు ఎమ్మెల్యే నడిపారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డి, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, తిరుపతి డిపో మేనేజర్ బాలాజి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ నాయకులు ముడిపల్లి సురేష్ రెడ్డి, కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, కొండూరు ప్రవీణ్, లోకాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి పాకాలలో ఉరుసు ఉత్సవాలు



దర్గా వద్ద పూర్తయిన ఏర్పాట్లు

పాకాల, జూలై 20: పోలీస్‌స్టేషన్ సమీపంలోని హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా దర్గా వద్ద ఆది, సోమవారాల్లో ఉరుసు ఉత్సవాలు జరగనున్నాయి. ఆదివారం రాత్రి దర్గా నుంచి గంధం ఊరేగింపు ఉంటుంది. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ఉరుసు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ రెండ్రోజులు రాత్రి ఖవ్వాలి గాయకులతో పాట కచ్చేరి ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం దర్గావద్ద అన్నదానం చేస్తారు. ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు.

కుష్టు వ్యాధి సర్వే సమగ్రంగా నిర్వహించాలి

భాకరాపేట, జూలై 20: కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే సమగ్రంగా నిర్వహించాలని జిల్లా కుష్టు నివారణ అధికారి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. భాకరాపేట పీహెచ్‌సీ శనివారం ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. వైద్యులు అలెగ్జాండర్, తేజస్విని, రాజా, డిప్యూటీ డెమో కిరణ్ కుమార్, సీహెచ్‌వో శేషుకుమారి, సూపర్‌వైజర్లు సుబ్రహ్మణ్యం, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ



పట్టువస్త్రాలు తెస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 20: బొప్పరాజుపల్లి సాయిబాబా ఆలయంలో కలశ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో శనివారం శుద్ధి,కలశప్రతిష్ఠ పూజాది కార్యక్రమాలు జరిగాయి. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు సోమురాయల్ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా కార్యదర్శి జేడీ జగన్, ఉమాపతినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గిరినాయుడు, జయచంద్రనాయుడు సాయిబాబాకు పట్టువస్త్రాలతోపాటు పూజాద్రవ్యాలు సమర్పించారు.

తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం

చంద్రగిరి, జూలై 20: చంద్రగిరిలోని స్వర్ణ సూపర్ మార్కెట్‌లో తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం విక్రయించే కేంద్రాన్ని ఎమ్మెల్యే పులివర్తి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మారుతి, సీఎస్‌డీటీ యుగంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో తీవ్ర ఇబ్బంది పడుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కిలో పచ్చి బియ్యం రూ.48, స్టీమ్ బియ్యం రూ.49, దేశవాలీ కందిపప్పు రూ.160 చొప్పున విక్రయిస్తోందని పేర్కొన్నారు.

22 కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, జూలై 20: ఆటోలో తరలిస్తున్న 22 కేజీల గంజాయిని, ముగ్గురు నిందితులను పట్టుకున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం నాగపట్నం జిల్లాకు చెందిన రామకృష్ణన్, సతీష్‌కుమార్, మధురైజిల్లాకు చెందిన ఆనందకుమార్ శనివారం ఒరిస్సా నుంచి 22 కేజీల గంజాయిని కొనుగోలు చేసి గూడూరులో రైలు దిగారన్నారు. అక్కడినుంచి ఆటోలో పోటుపాళెం జాతీయరహదారి వద్దకు చేరుకుని అక్కడ నుంచి చెన్నైకు లారీలో వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. అదే సమయంలో వాహనాల తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్ అనుమానంగా ఉన్న ఆ ముగ్గురు వ్యక్తులను గమనించి వారి వద్ద ఉన్న సూట్‌కేసును తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. నిందితుల నుంచి రూ. 2.50 లక్షల విలువచేసే 22 కేజీల గంజాయిని, 3 సెల్‌ఫోన్‌లను, రూ. 2,050 నగదును స్వాధీనం చేసుకున్నార న్నారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా లేకపోతే చట్టపరమైన చర్యలు : కలెక్టర్

నాయుడుపేట, జూలై20: విధులను బాధ్యతగా నిర్వహించకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శనివారం ఆయన పరిశీలించారు. గత ఆదివారం రాత్రి గురుకులంలోని 128 మంది విద్యార్థులు విషాహారంతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. గురుకులంలో కనీస మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం లేకపోవడంతో అంటువ్యాధులు ప్రబలిన విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ తరగతి గదులను, వసతి గృహ గదులను, వంటగది, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, స్నానపుగదులు, డ్రైనేజీను పరిశీలించారు. వారంరోజులలోపు అన్ని మరమ్మతుల పనులను పూర్తిచేయాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. సోమవారం నుంచి ఇంటర్మీడియట్, పదోతరగతి విద్యార్థులకు విద్యాభ్యాసాల బోధనలు చేపట్టాలన్నారు. ప్రిన్సిపాల్ దాదావీర్, సిబ్బందితో మాట్లాడి విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఆయన వెంట మున్సిపాల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఆర్ఐ సాయి, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



గురుకులంలో మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చెవిరెడ్డి దౌర్జన్యాల వల్లే వైసీపీని వీడాను



● సీఆర్ రాజన్

తిరుచానూరు, జూలై 20: తనను వైసీపీలోకి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీసుకువచ్చి ప్రోత్సహించారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. శనివారం తిరుచానూరులోని తన ఇంట్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో మద్దతు ఇవ్వాలంటూ తన అనుచరుడు గోవిందరెడ్డి ఇంటి ముందు వారంపాటు చెవిరెడ్డి ఎదురు చూసిన రోజులు మరచినట్లు ఉన్నాడని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చెవిరెడ్డి చేసిన దౌర్జన్యాల వల్లే తాను వైసీపీని వీడినట్లు తెలిపారు. తనకు పెద్దిరెడ్డికి ఎలాంటి సన్నిహిత సంబంధాలు లేవన్నారు. పెదిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఎమ్మెల్యే పులివర్తి నానికి గాడ్‌ఫాదర్ అని చెప్పడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సొంత నియోజకవర్గంలో చెవిరెడ్డి రోడ్లను బాగు చేయకుండా వేలాది సిమెంటు బల్లలను ఏర్పాటు చేసి కోట్లాది తుడా నిధులను దోచుకున్నారని ఆరోపించారు. ఈ సమాశేంలో టీడీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, హరేరామ్‌రెడ్డి, సాయి రాయల్, మునిరత్నం రెడ్డి, వాసు, మోహన్‌రెడ్డి, శేషాద్రి పాల్గొన్నారు.

ఏం మాట్లాడుతున్నావు చెవిరెడ్డీ?



● నాని భార్య పులివర్తి సుధారెడ్డి

తిరుపతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) 'గత పదేళ్లుగా అధికారంలో ఉండి ఊహించని విధంగా రెండు చోట్ల ఓడిపోవడంతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదు. ఆయన మానసిక పరిస్థితిపై అనుమానం కలుగుతోంది. మరోసారి అలా మాట్లాడితే కోర్టులో ముద్దాయిగా నిలబెడతా' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భార్య సుధారెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, 'మేము ఏదైనా ఆధారాలతో మాట్లాడతాం. మా క్వారీ విలువ రూ.30కోట్లు కూడా ఉండకపోతే రూ.48కోట్లు అపరాధ రుసుం వేశారు. కోర్టుకెళ్లి ఇంటీరియం ఉత్తర్వులు తెచ్చుకున్నాం. నిరాధారంగా నోటికొచ్చినట్టు మాట్లాడితే వింటూ ఊరుకునేది లేదు' అని ఆమె అన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి, చెవిరెడ్డికి మధ్య వ్యక్తిగత రాజకీయ కక్షలు ఉంటే వాళ్ల పార్టీలో తేల్చుకోవాలని హితవు చెప్పారు. అబద్ధాలతో చెవిలో పువ్వు పెడితే వినేందుకు ఇక్కడ జగన్ రెడ్డి కాదు.. లోకేశ్ బాబు అన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. తన కుమారుడు మోహిత్‌రెడ్డి అరెస్టు అవుతాడన్న ఆందోళనలో చెవిరెడ్డి ఏదంటే అది మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, తన భర్తపై హత్యాయత్నం చేసిన వాళ్లను శిక్షించేవరకు పోరాటం చేస్తానని సుధారెడ్డి ప్రకటించారు. 'చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు నాని ఎమ్మెల్యే అయితే చెవిరెడ్డికి మాత్రం నేనే ఎమ్మెల్యే' అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా, నిరాధార ఆరోపణలతో నిర్వహించే మీడియా సమావేశాలకు అనుమతి ఇవ్వొద్దని ఎస్పీని కోరుతున్నానని చెప్పారు.

అరేయ్.. ఒరేయ్‌ల సంస్కృతి వద్దు

● మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



తిరుపతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'రాజకీయంగా ఎన్ని విమర్శలైనా చేయచ్చుగానీ వ్యక్తిగతంగా అరేయ్.. ఒరేయ్.. వాడు.. వీడు అంటూ మాట్లాడడం మంచి సంప్రదాయం కాదు' అని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. పులివర్తి నాని తనపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన శనివారం తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. స్పష్టత, నిజాయితీ లేనప్పుడే వ్యక్తిగత విమర్శలకు దిగుతారంటూ, తానెప్పుడూ రాజకీయ ప్రత్యర్థులను అగౌరవంగా, పరుషంగా మాట్లాడలేదని అన్నారు. టీడీపీ అధిష్ఠానం నమ్మి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే నానీ 2019-24 మధ్య మంత్రి పెద్దిరెడ్డి అండతో వ్యాపారాలు భద్రంగా కాపాడుకున్నారని ఆరోపించారు. 'మద్దినాయనపల్లి వద్ద సర్వే నెంబరు 101లో ఎనిమిది హెక్టార్లలో క్వారీకి టీడీపీ ప్రభుత్వంలో కూడా రాని అనుమతి వైసీపీ ప్రభుత్వంలో మీ బంధువు గిరినాయుడు పేరిట రాలేదా? పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు తిరుమలరెడ్డిని భాగస్వామిగా చేసుకుని క్వారీని నడిపింది వాస్తవం కాదా?' అని చెవిరెడ్డి ప్రశ్నించారు. పుంగనూరు గొడవల్లో చంద్రబాబుతోపాటు టీడీపీ నేతలు అందరిపై కేసులు పెట్టారని, అయితే నాని ఒక్కరి మీద మాత్రమే కేసు ఎందుకు లేదో సమాధానం చెప్పాలన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నందున విచారణ జరిపించమని తానే ఈసీకి లేఖ రాస్తున్నానని చెప్పారు. కాగా సిట్ అధికారిగా వచ్చిన డీఎస్పీ రవిమనోహరాచారి మీద కూడా చెవిరెడ్డి ఆరోపణలు చేశారు.

మా నాయకులపై కేసులు పెట్టించింది మరిచారా చెవిరెడ్డీ?

● టీడీపీ నేతల ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, జూలై 20: తన కుమారుడు మోహిత్‌పై కేసు నమోదైతే బాధపడిపోతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గతంలో టీడీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టించిన విషయం మరిచిపోయారా అని టీడీపీ సీనియర్ నాయకులు ధ్వజమెత్తారు. శనివారం మామండూరు వద్ద టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత కుమార రాజారెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి.. సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఆలేఖకు స్పందించి చంద్రబాబు సిట్ విచారణ ఏర్పాటు చేశారని, ఇంతలో సిట్ బృందంలో నాని బంధువులు ఉన్నారని చెవిరెడ్డి ఆరోపించడం శోచనీయమన్నారు. కౌంటింగ్‌కు ముందు రోజు పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగినప్పుడు టీడీపీకి చెందిన 37 మందిపై 307 కేసులు అన్యాయంగా పెట్టారని నాని ఆరోపిస్తే.. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి.. తగిన ఆధారాలతో కేసులు పెట్టారని చెవిరెడ్డి చెప్పారని గుర్తు చేశారు. అప్పుడు అధికారులు తప్పు చేయరన్న చెవిరెడ్డి ఇప్పుడు సిట్ బృందంలో అధికారులపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చెవిరెడ్డి రెండు విధాలుగా మాట్లాడటం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమకు టీడీపీ క్రమశిక్షణ, అహింస, నిజాయితీతో పనిచేయడం నేర్పిందన్నారు. తమ నాయకుడు నాని అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారా? లేక మీరు పాల్పడ్డారా అని తెలుసుకోవాలంటే చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సత్య ప్రమాణం చేయడానికి సిద్ధం కావాలన్నారు. నాని గెలిచాక నియోజకవర్గంలో అన్ని మండలాలు అభివృద్ధి వైపు దృష్టి కేంద్రీకరించారని, దీనిని డైవర్ట్ చేయాలనే ఉద్దేశంతో చెవిరెడ్డి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీలో పదవులు ఎవరికి ఇవ్వాలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు తెలుసని హితవు పలికారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ముడిపల్లి సురేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, గౌస్‌బాషా, లోకాద్రినాయుడు, మునిరత్నంరాయల్, రాజుల గారి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మోహిత్ రెడ్డిపై కేసు అన్యాయం:వైసీపీ

తిరుపతి(ఆటోనగర్), జూలై 20: మహిళా విశ్వవిద్యాలయం వద్ద జరిగిన ఘటనతో ఎలాంటి సంబంధం లేని మోహిత్‌రెడ్డిపై కేసు పెట్టడం సమంజసం కాదని వైసీపీ నాయకులు దామినేడు కేశవులు, మాధవరెడ్డి, చినిన్నయాదవ్‌లు అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ చెవిరెడ్డిని ఎమ్మెల్యే పులివర్తి నాని అసభ్య పదజాలంతో మాట్లాడటం చాలా బాధాకరమన్నారు.

ఆకట్టుకున్న కురు, పాండవ జననం

రామచంద్రాపురం, జూలై 20: పరమాల మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి సుమతి వినిపించిన కురు, పాండవ జననం సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం హరికథ, సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు మేళతాళాల నడుమ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త రమేష్‌నాయుడు, సురేంద్రనాయుడు, జయరామిరెడ్డి, రోషిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.



వెటర్నరీ ఇన్‌చార్జి వీసీకి అభినందన

తిరుపతి రూరల్, జూలై 20: ఎస్వీ వెటర్నరీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన జేవీ రమణను నాన్ టీచింగ్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బాల కార్తీక్ మాట్లాడుతూ.. బోధనేతర ఉద్యోగుల కార్యవర్గ పదవీకాల ముగిసిందని, నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని ఉద్యోగులు తెలిపారు. బి.మహేష్, సి.మునీంద్రారెడ్డి, మనోహర్, రఘునాథరెడ్డి, వెంకటేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



తిరుపతి (ఆటోనగర్), జూలై 20: రాస్ ప్రధాన కార్యాలయం, హెల్పేజ్ ఇండియా సంయుక్తంగా వృద్ధ దివ్యాంగులకు పలు పరికరాలను పంపిణీ చేశారు. శనివారం రేణిగుంట మండలంలోని ఇందిరానగర్, కరకంబాడి కార్యాలయంలో 40 మంది దివ్యాంగులకు చేతికర్రలు, 18 మందికి ట్రైప్యాడ్లు, ఐదుగురికి వాకర్స్ స్టాండ్స్ ఇద్దరికి వీల్‌ఛైర్స్ అందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ టి.షఢక్, రాస్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌రెడ్డి, బాలాజీ, నాగరత్నమ్మ, సుబ్బులమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో వైద్య సౌకర్యం కల్పించండి

మాజీ సైనికుల వినతి



రాకేష్ మనోజ్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సైనికులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 20: స్విమ్స్‌లో మాజీ సైనికులకు వైద్యసౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి మాజీ సైనిక ఉద్యోగుల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి టి.మునికృష్ణయ్య, అఖిలభారత మాజీ సైనిక ఉద్యోగుల వైస్‌చైర్మన్ పి.అశ్వత్థనారాయణ, కోశాధికారి హరినాధ్ సుబేదార్‌లు డీవోసీ మేజర్ జనరల్ రాకేష్ మనోజ్‌ను కోరారు. శనివారం చిత్తూరులోని ఈజీహెచ్ఎస్ పాలిక్లినిక్‌లో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు రమేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మ్యానువల్‌గా పాపవినాశనం టోల్ రసీదులు

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సమస్య కారణంగా పాపవినాశనం టోల్‌గేట్‌లో ఇచ్చే రసీదులో 15వ నెల ముద్రణ జరగడంపై సోషల్ మీడియాలో భారీగా విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు దీనిపై ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులు శనివారం స్పందిస్తూ సాంకేతిక కారణాలతో సీరియల్ నెంబర్లు, తేదీలు తప్పుగా ప్రింట్ అయ్యాయని, దీన్ని త్వరలోనే అధిగమిస్తామన్నారు. అప్పటి వరకు వాహనదారులకు మ్యానువల్‌గా రసీదులు జారీ చేస్తామన్నారు. టోల్‌రసీదులపై ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు చేస్తున్నారని, అక్కడ ఎలాంటి అక్రమ వసూళ్లకు తావులేదని స్పష్టం చేశారు.

మత్తు మాత్రలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

ఎస్పీకి టీఎన్ఎస్ఎఫ్ విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూలై 20: జిల్లాలో మత్తు మాత్రలు, టానిక్‌లు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎస్పీ సుబ్బరాయుడికి టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్ వినతి పత్రం అందజేశారు. నగరంలో కొందరు ఆకతాయిలు, మహిళా విశ్వవిద్యాలయం, వసతి గృహాలు, శ్రీనివాస సేతు, జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలతో ప్రమాదకర స్టంట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కొందరు గంజాయి స్మగ్లర్లు వాహనాలకు నెంబరు ప్లేట్లు లేకుండా నడుపుతున్నారని చెప్పారు. నాయకులు అశోక్, వెంకటేష్‌యాదవ్, జానీ యాదవ్, భరత్, జ్ఞానేష్ పాల్గొన్నారు.



ఎస్పీని అభినందిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు



హెల్మెట్ల వినియోగంపై అవగాహన

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ల వినియోగంపై తిరుమల పోలీసులు శనివారం ద్విచక్రవాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ హైస్కూల్ రింగ్‌రోడ్డు సర్కిల్‌లో తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ సిబ్బంది కలిసి ఈకార్యక్రమాన్ని చేపట్టారు.

ద్విచక్రవాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

తిరుమల ఘాట్‌లో కారును ఢీకొన్న ద్విచక్రవాహనం

● ముగ్గురి నేపాలీలకు గాయాలు

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శనివారం ఓ ద్విచక్రవాహనం కారును ఢీకొంది. ఈప్రమాదంతో ముగ్గురు గాయపడ్డారు. కాలినడకమార్గంలో గుర్కాగా పనిచేసే నేపాల్‌కు చెందిన కైలాష్ మరో ఇద్దరు మహిళలతో కలిసి తన ద్విచక్రవాహనంలో తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణమయ్యాడు. 18వ మలుపు వద్ద ముందుకు వెళుతున్న కారును ఢీకొనడంతో ద్విచక్రవాహనం పడిపోయింది. దీంతో బైక్‌పై ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో తిరుపతికి వెళుతున్న జేఈవో వీరబ్రహ్మం గుర్తించి అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వచ్చేవరకు జేఈవో అక్కడే ఉండి బాధితులను తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో గాయపడ్డ నేపాలీలు

సరికొత్త బజాజ్ పల్సర్‌బైక్ లాంచింగ్

తిరుపతి అర్బన్, జూలై 20: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బజాజ్ పల్సర్ ఎన్ఎస్ 400జెడ్ ద్విచక్రవాహనాన్ని రేణిగుంట రోడ్డు శ్రీరామ్ ఎంటర్‌ప్రైజస్‌లో శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం ఎండీ రాజా సాకేత్ రామ్ మాట్లాడుతూ తాజాగా తయారు చేయబడిన బజాజ్ పల్సర్ ఎన్ఎస్ 400జెడ్ వాహనం ధర రూ.1.85లక్షలన్నారు. ఆకర్షణీయంగా, అత్యంత శక్తిసామర్థ్యం కలిగిన తొలివాహనమని, అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. క్రీడలకు, వర్ష ప్రయాణంలో అనుకూలమని, డిజిటల్ ఎల్ఈడీ, బ్లూటూత్, రైడ్ కనెక్ట యాప్‌తో నాలుగు రంగుల్లో వాహనం అందుబాటులో ఉందన్నారు. మార్కెట్‌లోకి విడుదల చేసిన వెంటనే కడపకు చెందిన మహ్మద్ సయ్యద్, మదనపల్లెకు చెందిన షేక్ జిలాని, చిత్తూరుకు చెందిన శివకుమార్‌లు కొనుగోలు చేశారన్నారు. అలాగే అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన చేతక్ 2901 బ్లూలైన్ ఎలక్ట్రిక్ వాహనాన్ని శనివారం సాయంత్రం పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ ప్రారంభించారు. దీని ధర దాదాపు లక్ష, అన్ని సదుపాయాలు ఉన్నాయని, నాలుగు రంగుల్లో వాహనం అందుబాటులో ఉందని షోరూం డీలర్స్ పేర్కొన్నారు. అనంతరం తొలిగా కొనుగోలుచేసిన ముగ్గురు కస్టమర్లకు వీసీ చేతుల మీదుగా బైక్ తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ఎంటర్‌ప్రైజస్ ఎండీలు రాజా శ్రీనివాసరావు, రాజా వెంకటఅభినవ్‌రామ్, మేనేజర్ జి.వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.



నూతన బైక్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పోలవరం ప్రాజెక్టుపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(ఆటోనగర్), జూలై 20: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు నేటికి పూర్తి చేయక పోవడంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రిగా అంజయ్య, ఇరిగేషన్ మంత్రిగా ఉన్న నాదెండ్ల భాస్కర్‌రావులు ఈ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. అప్పటినుంచి నేటివరకు రూ.30 లక్షల కోట్లు విడుదల చేసినా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఎన్ని నిదులు ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పారు. 2019లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారం నుంచి తప్పుకొనే సమయానికి రూ.2.68 లక్షల కోట్ల అప్పులు ఉండేవని గుర్తు చేశారు. ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి చేసిన అప్పులను ప్రజలకు చంద్రబాబు తెలియజేయాలని కోరారు. మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం ఓడరేవు, తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అవసరం లేదన్నారు.

టీటీడీ ఏడీ బిల్డింగ్ వద్ద నిరసన

టీటీడీలో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల కేటాయింపుల వివరాలు పారదర్శకంగా ఉంచాలని చింతామోహన్ కోరారు. ఈమేరకు టీటీడీ ఏడీ బిల్డింగ్ వద్ద నిరసన తెలిపారు. టీటీడీ ఉద్యోగులకు, తిరుపతి వర్కింగ్ జర్నలిస్ట్‌లకు అలిపిరి వద్ద ఉన్న ఏడు వేల ఎకరాల్లో ఇంటి స్థలాలు కేటాయించాలని చెప్పారు. అలాగే కొంత భాగంలో ఐటీ కంపెనీలకు కూడా స్థలాన్ని కేటాయించాలని సూచించారు. పాదిరేడు వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, రావణన్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్), జూలై 20: విద్యుత్ కేంద్రాల్లో ప్రజలు తమ వినియోగ బిల్లులను ఆదివారం కూడా చెల్లించవచ్చని ఎస్ఈ సురేంద్రనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లలో ఎస్పీడీసీఎల్ యాప్ లోడ్ చేసుకుని, దాని కూడా చెల్లించవచ్చన్నారు.

భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోంది

హోంమంత్రి అనిత



తిరుమల ఆలయం వెలుపల భక్తులతో మాట్లాడుతున్న అనిత

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి):శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోందని హోంమంత్రి అనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం అనిత ఆలయం ముందు భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు చాలా ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నారన్నారు. గతానికంటే ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని, లడ్డూ, అన్నప్రసాదాల్లో నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నట్టు తెలిపారు. ఇదే ఆనందం భక్తుల్లో నిత్యం ఉండాలని కోరుకుంటున్నానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎన్డీయే కూటమిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. స్వామి ఆశీస్సులుంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుందనే నమ్మకం ఉందన్నారు.

23న జంప్ రోప్ జట్ల ఎంపిక

మంగళం, జూలై 20: జిల్లాస్థాయి జంప్‌రోప్ జట్ల ఎంపికను ఈనెల 23న తిరుపతి-కరకంబాడీ మార్గంలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జంప్‌రోప్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సాంబశివరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-12, అండర్-14 విభాగాల ఎంపికలకు క్రీడా సామగ్రిని క్రీడాకారులే తెచ్చుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు ఈ నెల 27, 28 తేదీల్లో కర్నూల్‌జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. మరిన్ని వివరాలకు 63001 12569, 83415 90345 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.27 కోట్లు

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.27 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 65,134 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 26,100 మంది తలనీలాలు సమర్పించారు.

రైలు పట్టాలపై పడి మహిళ మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 20: తిరుచానూరు రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని మహిళ రైలు పట్టాలపై పడి మృతి చెందింది. రైల్వే సీఐ హేమసుందరం తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన మహిళకు 35 ఏళ్ల వయసు ఉంటుంది. కుడిచేతిపై పరిమళ అనే పేరు, ఎడమ చేతిపై రాజా అనే పేరు పచ్చబొట్టుతో ఉంది. ఎలాంటి వ్యక్తిగత ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 88867 81045, 94406 27638 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

రెడ్ల రాజ్యంగా రాయలసీమ

ఓ సామాజిక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడం సీమ చరిత్రకు దర్పణం - బీఎస్పీ జోనల్ సమావేశంలో రిటైర్డు డీజీపీ పూర్ణచంద్రరావు



బీఎస్పీ సమావేశంలో ప్రసంగిస్తున్న పూర్ణచంద్రరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20: రాయలసీమ రెడ్ల రాజ్యంగా మారిందనీ.. ఒక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడమే ఇక్కడి చరిత్రకు దర్పణమని రిటైర్డు డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన బీఎస్పీ జోనల్ స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. బలిజలతో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు రాయలసీమలో 70 శాతం ఉన్నారని, అయితే కేవలం 8 శాతం మాత్రమే వున్న రెడ్డి సామాజిక వర్గం దశాబ్దాలుగా ఇతర కులాలను, మరీ ముఖ్యంగా ఎస్సీ, బీసీ వర్గాలను ఎదగనీయకుండా అడ్డుపడుతోందన్నారు. ఒక వైపు భయపెడుతూ మరో వైపు దోచుకుంటూ అన్ని ప్రధాన పార్టీల్లోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు రాజ్యమేలుతున్నారని వాపోయారు. గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మెజారిటీ స్థానాలు రెడ్లకే కేటాయించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వు సీట్లు వల్ల ఎస్సీలకు ఆ మాత్రం సీట్లున్నాయనీ, లేకపోతే వాటిని కూడా మాయం చేసి ఉంటారన్నారు.వైఎస్, పెద్దిరెడ్డి, జేసీ, భైరెడ్డి, నల్లారి, భూమన, శిల్పా, మేకపాటి తదితరుల వలలో చిక్కి రాయలసీమ సర్వనాశనం అయ్యిందన్నారు.కులగణన జరగకుండా సామాజిక న్యాయం జరగదని స్పష్టం చేశారు.బీఎస్పీ రాయలసీమ కో-ఆర్డినేటర్, రిటైర్డు జడ్జి గుర్రప్ప, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, ఉపాధ్యక్షులు గౌతం, నాయకులు మల్లిక, విజయకుమార్, జానకిప్రసాద్, సురేంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై మెకానిక్‌ల బైక్ ర్యాలీ



తిరుపతి (జీవకోన), జూలై 20: ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్లు ధరించాలంటూ శనివారం మెకానిక్‌లు బైక్ ర్యాలీ నిర్వహించారు. తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. తొలి దశగా 35మంది సభ్యులకు అసోసియేషన్ ద్వారా పోస్టల్ ఇన్సూరెన్సు చేయించినట్లు చెప్పారు. కార్యదర్శి జలంధర్, ప్రతినిదులు లక్ష్మారావు, గురు, ప్రభు, మల్లేశ్వర్, సోమశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు : 8 దుంగల స్వాధీనం



స్మగ్లర్, ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూలై 20: అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ ప్రాంతంలో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఎనిమిది ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ స్మగ్లర్‌ని అరెస్టు చేశారు. ఆర్ఐ(ఆపరేషన్స్) సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం శుక్రవారం అటవీశాఖ సిబ్బందితో కలిసి సానిపాయ బేస్ క్యాంపు నుంచి రాయవరం మీదుగా ఆవులదారి, సరస్వతి కటువ, ముదుంపాడు అటవీప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. అటవీప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకెళ్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టగా దుంగలను వదలి పారిపోయారు. వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా అత్తిపట్టు, వీరప్పనూరు పంచాయతీకి చెందిన రమేష్(32)గా గుర్తించారు. అనంతరం సంఘటనా స్థలం నుంచి ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌లో సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో

వృద్ధురాలి హత్య కేసు నిందితుడు!

లోతుగా విచారిస్తున్న దర్యాప్తు బృందం



స్కూటర్‌పై పరారవుతున్న శ్రీనివాసులు

తిరుపతి (నేరవిభాగం), జూలై 20: తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం రాత్రి జరిగిన వృద్ధురాలు జయలక్ష్మి హత్య కేసులో నిందితుడిగా గుర్తించిన శ్రీనివాసులును పోలీసులు తిరుమలలో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉన్మాదిగా తయారైన ఆ యువకుడు రెండు కుటుంబాల మధ్య నెలకొన్న మనస్పర్థలు, వృద్ధురాలు తరచూ మందలిస్తుండడంతో పగ పెంచుకున్నాడు. రెండేళ్ల కిందట కూడా జయలక్ష్మి ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించినట్లు సమాచారం. ఆ తర్వాత ఇంటి ముందున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ రెండు ఘటనలతో రాయల్‌నగర్ నుంచి పెద కాపు లేఅవుట్‌కు కాపురం మార్చాలని స్నేహితులు, కొందరు కుటుంబీకులు జయలక్ష్మి కుటుంబానికి సూచించినా వారు పట్టించుకోలేదు. ఈ విషయాలు తెలియడంతో దర్యాప్తు బృందం మరింత లోతుగా విచారిస్తోంది.

విచారణలో ఆసక్తికరమైన విషయాలు : పోలీసుల విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడైనట్లు సమాచారం. నిందితుడు శ్రీనివాసులు.. జయలక్ష్మి మనవరాలిని ఈవ్‌టీజింగ్ చేసేవాడు. దీనిపై మనవరాలు తండ్రికి చెప్పింది. 'ఏమీ కాదులే నువ్వు ధైర్యంగా వెళ్లు.. నేను చూసుకుంటా' అని ఆమె తండ్రి పలుసార్లు ధైర్యం చెప్పి భరోసా కల్పించాడని తెలిసింది. ఇది తెలిసి జయలక్ష్మి పలుసార్లు శ్రీనివాసులును మందలించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. దీంతో పగ పెంచుకున్న శ్రీనివాసులు హత్యకు మూడు, నాలుగు రోజుల నుంచి వృద్ధురాలి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. ఒంటరిగా దొరికితే చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం జయలక్ష్మిని ఒంటరిగా వదిలి ఆమె కోడలు, పెద్ద మనవరాలు డ్రైవింగ్ నేర్చుకోవడానికి బయటకు వెళ్లారు. చిన్న మనవరాలు 15 నిమిషాల్లో స్కూల్ నుంచి వస్తోందని తెలిసి గేట్లు అన్నీ కూడా తెరచి పెట్టారు. దీన్ని అదనుగా భావించిన నిందితుడు తనింట్లో వారికి గుంటూరుకు వెళుతున్నానని చెప్పి బ్యాగు సర్దుకుని బయటకు వచ్చాడు. మెయిన్ గేటు ద్వారా ఇంట్లోకి ప్రవేశించి ఫస్ట్ ఫ్లోర్‌లో ఎవ్వరూ లేకపోవడంతో అక్కడ బట్టలు మార్చుకున్నాడు. డూప్లెక్స్ హౌస్ కావడంతో రెండో ఫ్లోర్‌లోకి వెళ్లి అక్కడున్న జయలక్ష్మిని కత్తితో వెనుక నుంచి బలంగా పొడిచాడు. ఆమె గట్టిగా కేకలు వేసింది. కింది ఫ్లోర్‌లోని బెడ్‌రూములో ఉన్న చిన్న మనవరాలు నియతి కూడా అరవడంతో ఆమెవద్దకొచ్చి గట్టిగా నెట్టాడు. ఆమె కిందపడి స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత ఇంట్లో ఉన్న వేయింగ్ మిషన్‌తో మళ్లీ రెండో ఫ్లోర్‌కి వెళ్లి వృద్ధురాలి ముక్కుపై బలంగా బాది హత్య చేశాడు. మరోవైపు స్పృహలోకి వచ్చిన నియతి రెండో అంతస్తులోకి వెళ్లగా ఆమె మెడపై నాలుగు కత్తి పోట్లు పొడిచాడు. నియతి గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో ఇంట్లోకి వస్తున్న కోడలు రక్ష, పెద్ద మనవరాలు ప్రేరణ ఈ కేకలను విన్నారు. మరోవైపు నిందితుడు పరారవుతున్న క్రమంలో కిందకు దిగగా.. ఎదురుగా మెట్లపై కనిపించిన ప్రేరణను పక్కకున్న గోడకు బలంగా బాది, ఆమె వద్ద నుంచి ద్విచక్ర వాహనం తాళాలు లాక్కొని పరారైనట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.



కళలను ఆదరించాలి



చిన్నికృష్ణనాయక్, మల్లికార్జునయ్యలకు సన్మానం

తిరుపతి (కల్చరల్), జూలై 20: కళలను ఆదరించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, న్యూఢిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, అమరావతి, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీలు శనివారం మహతిలో వేడుకగా మొదలయ్యాయి. సాయంత్రం జరిగిన ప్రారంభ సభలో వ్యాపారవేత్త ముబ్బు సూర్యనారాయణ రెడ్డి, టీటీడీ పాలక మండలి పూర్వ సభ్యుడు పోకల అశోక్ కుమార్, ప్రముఖ వైద్యుడు లింగుట్ల రమేష్ నాథ్, సాహితీవేత్త జి.చెన్నకేశవులు నాయుడు, బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, ఆదాయపన్ను శాఖ అధికారి శివరామకృష్ణ, విద్యావేత్తలు విశ్వనాథరెడ్డి, దివాకర్ రెడ్డి, వ్యాపారవేత్త కృష్ణమూర్తి, నిర్వాహకుడు బీఎన్ రెడ్డి, మిమిక్రీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. 24 ఏళ్లగా కళాసేవలో ఉన్న అభినయ ఆర్ట్స్ వంటి సంస్థల సేవలు ప్రశంసనీయమన్నారు. నాటక, సాంస్కృతిక పోటీలను ప్రజలు హాజరై తిలకించాలని కోరారు. తొలి రోజు సభలో విశిష్ట కళా పురస్కారాలను డాక్టర్ బుంగా మల్లికార్జునయ్య (కళారంగం), రమావత్ చిన్నికృష్ణనాయక్ (ఎవరెస్ట్ ఎక్కారు. సింగర్ మంగ్లీ బంధువు కూడా)లకు అందజేసి, సత్కరించారు. ఉదయం నుంచి పలు అంశాల్లో నృత్యపోటీలు జరిగాయి. మధ్యాహ్నం శ్రీవినాయక నాటక కళామండలి, రేణిగుంట వారి శివలీలలు పద్యనాటకం, రాత్రి ఎనిమిది గంటలకు గోవాడ క్రియేషన్స్, హైదరాబాదు వారి మూల్యం సాంఘిక నాటిక ప్రదర్శించారు.

నేటి కార్యక్రమాలిలా.. : ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నృత్యపోటీలు జరుగుతాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు రసరంజని, హైదరాబాదు వారి నచికేత ఆధ్యాత్మిక నాటకం, సాయంత్రం 6.30 గంటలకు శ్రీగరికపాటి రాజారావు కళానికేతన్, ఏలేశ్వరం, కాకినాడ వారి ఆకాంక్ష సాంఘిక నాటిక, రాత్రి 8 గంటలకు నటీనట సంక్షేమ సమాఖ్య, పాలకొల్లు వారి అనూహ్యం సాంఘిక నాటిక ప్రదర్శిస్తారు.



నృత్యం చేస్తున్న కళాకారిణులు - శివలీలలు పద్యనాటకం - మూల్యం సాంఘిక నాటిక

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



జస్టిస్ శ్రీసుధ - ఆలయం ముందు విశ్వప్రియతీర్థ స్వామి - కుటుంబ సభ్యులతో శ్రీకాంత్

తిరుమల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ, ఉడిపిలోని అదుమారు మఠాధిపతి విశ్వప్రియతీర్థ స్వామి, కుటుంబీకులతో సినీ నటుడు శ్రీకాంత్ ఉన్నారు. శ్రీకాంత్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది స్వామిని దర్శించుకోవడం తమకు ఆనవాయితీ అన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి తన కుమారుడు రోషన్ నూతన చిత్రం షూటింగ్ మొదలుకానున్న నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చామన్నారు. 'దేవర', 'గేమ్‌ఛేంజర్' సినిమాల్లో ప్రధాన పాత్రలో నటిస్తున్నానని, అలాగే ప్రముఖహీరో మోహన్‌లాల్‌తో మరో చిత్రంలో నటిస్తున్నట్టు చెప్పారు. అలాగే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎమ్మెల్సీలు కల్యాణి, సిపాయి సుబ్రహ్మణ్యం, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

దొంగ అరెస్టు

రూ.8.30 లక్షల బంగారు నగలు, వెండి వస్తువుల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), జూలై 20: ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.8.30 లక్షలు విలువైన 137 గ్రాములు బంగారు నగలు, 300 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. క్రైం డీఎస్పీ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం ఎల్‌బీ నగర్‌కు చెందిన గుండ్లపట్టి మునిరాజ కొంతకాలంగా తిరుపతి చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేస్తున్నాడు. ఎస్పీ ఆదేశాలతో చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచారు. స్థానిక హరేరామ హరేకృష్ణ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మునిరాజను పట్టుకుని విచారించడంతో చోరీలు బయటపడ్డాయి. దాంతో అతడిని అరెస్టు చేసి.. బంగారు నగలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐలు కళా వెంకటరమణ, ఎస్ఐ సాయినాథ్ చౌదరి, సిబ్బందికి రివార్డులు అందించడానికి ప్రతిపాదనలు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం



శ్రీనివాసులు - కిరణకుమారి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20: ఎస్వీయూ సైకాలజీ స్కాలర్ శ్రీనివాసులు 'కాగ్నిటివ్ స్టైల్స్ ఇన్ రిలేషన్ టు క్రియేటివిటీ, మెంటల్ హెల్త్ అండ్ అడ్జస్ట్‌మెంట్ -అమాంగ్ హైస్కూల్ స్టూడెంట్స్' అంశంపై ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీతఃఈ దామ్లానాయక్ తెలిపారు. ● పద్మావతి వర్సిటీ లా స్కాలర్ ఎస్. కిరణ్ కుమారి 'రోల్ ఆఫ్ పేషెంట్స్ ఇన్ ఫార్మసీ ఇండస్ట్రీ అండ్ రైట్ టు హెల్త్ ఇన్ ఇండియా' అంశంపై డాక్టర్ మాధురి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

హత్యా రాజకీయాల్లో జగన్‌కి మించినవారు లేరు

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనడం హాస్యాస్పదం : తెలుగు యువత



వాల్‌పోస్టర్లతో రవినాయుడు తదితరులు

తిరుపతి(ఆటోనగర్),జూలై20:హత్యారాజకీయాలు చేయడంలో మాజీ సీఎం జగన్‌కి మించిన వారు ఎవ్వరూ లేరని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు.ప్రెస్‌క్లబ్‌లో శనివారం జగన్‌ని విమర్శిస్తూ ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని విధ్వంసం చేయాలన్నా, హత్యలు చేయాలన్నా, ఓదార్పాలన్నా జగన్‌కే సాధ్యమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసి.. ఇప్పుడు శాంతి భద్రతలు క్షీణించాయని, రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తండ్రి మృతి తర్వాత రాజకీయ పార్టీ పెట్టి, బాబాయి హత్య అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మీకే.. రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చిన ఘనత కూడా దక్కుతుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలకు టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పల్నాడు ఘటనలో గొడవపడిన ఇద్దరూ వైసీపీ కార్యకర్తలన్నారు. జిలానీ ఎప్పటికీ వైసీపీ కార్యకర్తే అన్న విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలన్నారు. 40 రోజులుగా రాష్ట్రంలో ఆయన స్వేచ్ఛగా తిరుగుతున్నాడంటే టీడీపీ పాలన ఎలా ఉందో చూసి.. నేర్చుకోవాలని హితవు పలికారు. తెలుగు యువత నాయకులు కృష్ణయాదవ్, ఆర్‌పీ శ్రీనివాసులు, టి.వాసుదేవ్, కె.సందీప్, రఫీ, రంజిత్ నాయుడు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వర ఆలయ భూములకు వేలంపాట

నాయుడుపేటటౌన్, జూలై20: శ్రీకాళహస్తీశ్వర, వేణుగోపాలస్వామి ఆలయాలకు సంబంధించిన భూములకు శనివారం దేవదాయశాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ ఆలయాలకు సంబంధించిన భూమి నాయుడుపేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఆలయాల కాంప్లెక్స్ వెనుక ఉన్న 60 సెంట్ల భూమికి శనివారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విన్నమాలలోని ఆలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహించారు. నెలకు లక్ష రూపాయలకు అరవభూమి శ్రీనివాసులురెడ్డి దక్కించుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఈవో కేవీ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



వెంకటగిరి, జూలై 20 : పట్టణంలోని కోళ్ళఫాం, రైల్వేస్టేషన్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలను నియోజకవర్గ టీడీపీ వర్కింగ్ పెసిడెంట్ కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ శనివారం సందర్శించారు. పౌష్టికారం సక్రమంగా అందుతుందా లేదా అని తెలుసుకొన్నారు. పిల్లల ఆలనాపాలన చూసుకోవాల్సిన బాధ్యత కేంద్రాల్లోని సిబ్బందిపై వుందన్నారు. ఇంకా ఆమె కృషివిజ్ఞాన కేంద్రం, నిమ్మ, చీనీ పరిశోధన కేంద్రాలను సందర్శించి రైతులకు సాంకేతికతను అందించాలని ఆమె శాస్త్రవేత్తలకు విజ్ఞప్తి చేశారు. పంటల సాగులో మెలకువలు రైతులకు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, వడ్లపూడి విజయకుమార్ పాల్గొన్నారు.

చెరువుల వేలం పాటల కోసం ప్రతిపాదనలు

ఓజిలి, జూలై 20 : ఓజిలి మండలంలో ఎంపిక చేసిన చెరువులకు వేలం పాటలు నిర్వహించేందుకు డివిజనల్ పంచాయతీ అధికారుల అనుమతి కోసం పంపించామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గతంలో జరిగిన చెరువుల వేలం పాటలు 2024 జూన్ నెలతో ముగిశాయన్నారు. 2024-25కు సంబంధించిన కొత్త ఫసలీ నేపథ్యంలో ఆయా చెరువులకు వేలం పాటలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఈవోపీఆర్‌డీ మోహన్ ద్వారా అన్ని వివరాలతో కూడిన నివేదికలను కూడా సిద్ధం చేశామన్నారు. అధికారుల నుంచి అనుమతి వచ్చిన తరువాత చెరువుల వేలం పాటల ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గూడూరు అర్బన్, జూలై 20: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధి కార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగివుండాలన్నారు. ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సులోచనారాణి, ఎస్‌ఐ సుబ్రమణ్యంరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రొయ్యల గుంటల్లో మత్స్యశాఖ అధికారులు తనిఖీలు



వైట్‌స్పాట్‌కు గురైన రొయ్యలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ డీఎఫ్‌వో నాగరాజు, అధికారులు

కోట, జూలై 20 : కోట మండలం సిద్ధవరం, దొరువుకట్ట, ఉత్తమ నెల్లూరు గ్రామాల్లో ఉన్న రొయ్యల గుంటలను, అందులోని రొయ్యలను మత్స్యశాఖ డీఎఫ్‌వో నాగరాజు, ఏడీ, ఎఫ్‌డీవోలు పరిశీలించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన టైగర్ రొయ్యకు వైట్‌స్పాట్ అన్న వార్తకు మత్స్యశాఖ అధికారులు స్పందించారు. ఆయా గ్రామాల్లోని రొయ్యల గుంటల్లో వైట్‌స్పాట్‌కు గురై చనిపోయిన రొయ్యలను పరిశీలించారు. ఆక్వారైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వాతావరణంలో మార్పుల వల్లకూడా ఈ వైట్‌స్పాట్ వైరస్ రొయ్యలకు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన నమూనాలను కూడా సేకరించి ఈ ల్యాబ్‌లకు పంపుతామన్నారు. రొయ్యల గుంటలను శుభ్రం చేయని కారణంగా కలుషితాలు నీటిలో కలవడంవల్ల కూడా వైట్‌స్పాట్ ప్రబలే అవకాశం ఉందన్నారు. వీటన్నింటిని పరిశీలించేందుకు అధ్యాయన బృందం వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు రానున్నట్లు డీఎఫ్‌వో నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవోలు రెడ్యానాయక్, రఘు, మత్స్యశాఖ ప్రతినిధులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెళ్లకూరు, జూలై 20: మండలంలోని సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. 23న తాళ్వాయిపాడు, 24న చావాలి, 25 శిరసనంబేడు, 26 చెంబేడు, 27న పుల్లూరు సచివాలయల్లో కొత్తగా ఆధార్ నమోదు, ఇంటి చిరునామా, మొబైల్ నెంబర్, వేలిముద్రలు తదితర వాటికి ఈ కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయమ్మ ఉన్నారు.

పోలీసుల అదుపులో వృద్ధురాలి హత్య కేసు నిందితుడు!

లోతుగా విచారిస్తున్న దర్యాప్తు బృందం

తిరుపతి (నేరవిభాగం), జూలై 20: తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం రాత్రి జరిగిన వృద్ధురాలు జయలక్ష్మి హత్య కేసులో నిందితుడిగా గుర్తించిన శ్రీనివాసులును పోలీసులు తిరుమలలో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉన్మాదిగా తయారైన ఆ యువకుడు రెండు కుటుంబాల మధ్య నెలకొన్న మనస్పర్థలు, వృద్ధురాలు తరచూ మందలిస్తుండడంతో పగ పెంచుకున్నాడు. రెండేళ్ల కిందట కూడా జయలక్ష్మి ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించినట్లు సమాచారం. ఆ తర్వాత ఇంటి ముందున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ రెండు ఘటనలతో రాయల్‌నగర్ నుంచి పెద కాపు లేఅవుట్‌కు కాపురం మార్చాలని స్నేహితులు, కొందరు కుటుంబీకులు జయలక్ష్మి కుటుంబానికి సూచించినా వారు పట్టించుకోలేదు. ఈ విషయాలు తెలియడంతో దర్యాప్తు బృందం మరింత లోతుగా విచారిస్తోంది.

విచారణలో ఆసక్తికరమైన విషయాలు

పోలీసుల విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడైనట్లు సమాచారం. నిందితుడు శ్రీనివాసులు.. జయలక్ష్మి మనవరాలిని ఈవ్‌టీజింగ్ చేసేవాడు. దీనిపై మనవరాలు తండ్రికి చెప్పింది. 'ఏమీ కాదులే నువ్వు ధైర్యంగా వెళ్లు.. నేను చూసుకుంటా' అని ఆమె తండ్రి పలుసార్లు ధైర్యం చెప్పి భరోసా కల్పించాడని తెలిసింది. ఇది తెలిసి జయలక్ష్మి పలుసార్లు శ్రీనివాసులును మందలించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. దీంతో పగ పెంచుకున్న శ్రీనివాసులు హత్యకు మూడు, నాలుగు రోజుల నుంచి వృద్ధురాలి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు. ఒంటరిగా దొరికితే చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గురువారం జయలక్ష్మిని ఒంటరిగా వదిలి ఆమె కోడలు, పెద్ద మనవరాలు డ్రైవింగ్ నేర్చుకోవడానికి బయటకు వెళ్లారు. చిన్న మనవరాలు 15 నిమిషాల్లో స్కూల్ నుంచి వస్తోందని తెలిసి గేట్లు అన్నీ కూడా తెరచి పెట్టారు. దీన్ని అదనుగా భావించిన నిందితుడు తనింట్లో వారికి గుంటూరుకు వెళుతున్నానని చెప్పి బ్యాగు సర్దుకుని బయటకు వచ్చాడు. మెయిన్ గేటు ద్వారా ఇంట్లోకి ప్రవేశించి ఫస్ట్ ఫ్లోర్‌లో ఎవ్వరూ లేకపోవడంతో అక్కడ బట్టలు మార్చుకున్నాడు. డూప్లెక్స్ హౌస్ కావడంతో రెండో ఫ్లోర్‌లోకి వెళ్లి అక్కడున్న జయలక్ష్మిని కత్తితో వెనుక నుంచి బలంగా పొడిచాడు. ఆమె గట్టిగా కేకలు వేసింది. కింది ఫ్లోర్‌లోని బెడ్‌రూములో ఉన్న చిన్న మనవరాలు నియతి కూడా అరవడంతో ఆమెవద్దకొచ్చి గట్టిగా నెట్టాడు. ఆమె కిందపడి స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత ఇంట్లో ఉన్న వేయింగ్ మిషన్‌తో మళ్లీ రెండో ఫ్లోర్‌కి వెళ్లి వృద్ధురాలి ముక్కుపై బలంగా బాది హత్య చేశాడు. మరోవైపు స్పృహలోకి వచ్చిన నియతి రెండో అంతస్తులోకి వెళ్లగా ఆమె మెడపై నాలుగు కత్తి పోట్లు పొడిచాడు. నియతి గట్టిగా కేకలు వేసింది. ఆ సమయంలో ఇంట్లోకి వస్తున్న కోడలు రక్ష, పెద్ద మనవరాలు ప్రేరణ ఈ కేకలను విన్నారు. మరోవైపు నిందితుడు పరారవుతున్న క్రమంలో కిందకు దిగగా.. ఎదురుగా మెట్లపై కనిపించిన ప్రేరణను పక్కకున్న గోడకు బలంగా బాది, ఆమె వద్ద నుంచి ద్విచక్ర వాహనం తాళాలు లాక్కొని పరారైనట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వెంకన్నపాళెం పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కోట : వెంకన్నపాళెం ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు మహ్మద్‌రజ్వి, సులోచనరాణి పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి పట్టివేత

గూడూరు, జూలై 20: ఆటోలో తరలిస్తున్న 22 కేజీల గంజాయిని, ముగ్గురు నిందితులను పట్టుకున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం నాగపట్నం జిల్లాకు చెందిన రామకృష్ణన్, సతీష్‌కుమార్, మధురైజిల్లాకు చెందిన ఆనందకుమార్ శనివారం ఒరిస్సా నుంచి 22 కేజీల గంజాయిని కొనుగోలు చేసి గూడూరులో రైలు దిగారన్నారు. అక్కడినుంచి ఆటోలో పోటుపాళెం జాతీయరహదారి వద్దకు చేరుకుని అక్కడ నుంచి చెన్నైకు లారీలో వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. అదే సమయంలో వాహనాల తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ మనోజ్‌కుమార్ అనుమానంగా ఉన్న ఆ ముగ్గురు వ్యక్తులను గమనించి వారి వద్ద ఉన్న సూట్‌కేసును తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. నిందితుల నుంచి రూ. 2.50 లక్షల విలువచేసే 22 కేజీల గంజాయిని, 3 సెల్‌ఫోన్‌లను, రూ. 2,050 నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

బాధ్యతగా లేకపోతే చట్టపరమైన చర్యలు : కలెక్టర్

నాయుడుపేట, జూలై20: విధులను బాధ్యతగా నిర్వహించకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శనివారం ఆయన పరిశీలించారు. గత ఆదివారం రాత్రి గురుకులంలోని 128 మంది విద్యార్థులు విషాహారంతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. గురుకులంలో కనీస మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం లేకపోవడంతో అంటువ్యాధులు ప్రబలిన విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ తరగతి గదులను, వసతి గృహ గదులను, వంటగది, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, స్నానపుగదులు, డ్రైనేజీను పరిశీలించారు. వారంరోజులలోపు అన్ని మరమ్మతుల పనులను పూర్తిచేయాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. సోమవారం నుంచి ఇంటర్మీడియట్, పదోతరగతి విద్యార్థులకు విద్యాభ్యాసాల బోధనలు చేపట్టాలన్నారు. ప్రిన్సిపాల్ దాదాపీర్, సిబ్బందితో మాట్లాడి విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఆయన వెంట మున్సిపాల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఆర్‌ఐ సాయి, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



గురుకులంలో మరమ్మతుల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీవారి అన్నప్రసాదం, లడ్డూ నాణ్యతలో లోపాలు గుర్తించాం

టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, జూలై20(ఆంధ్రజ్యోతి):శ్రీవారి భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం, లడ్డూల నాణ్యతలో లోపాలు గుర్తించామని, వాటి నాణ్యత పెంపుకోసం ఇప్పటికే చాలా మార్పులు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.క్యూలైన్లో భక్తులకు ఆహారపదార్థాలు, పిల్లలకు పాలు అందడం లేదని, సాంబారన్నం నాణ్యత బాగలేదని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరని ఫిర్యాదులందిన క్రమంలో క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయం ఆహారపదార్థాలు అందించేందుకు ప్రత్యేకంగా మూడు షిఫ్టుల్లో ఏఈవో స్థాయి అధికారులను నియమించామన్నారు.మరుగుదొడ్లను రెట్టింపు చేయడంతో పాటు కొన్ని చోట్ల శాశ్వత క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పదార్థాలతో స్వామికి నైవేద్యం సమర్పిస్తున్నారని,అయితే అవి ఆర్గానిక్ కాదనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.కాబట్టి సేంద్రియ పదార్థాలా కాదా అనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో రైస్, సాంబారు, మజ్జిగ వంటి పదార్థాల్లో నాణ్యత కనిపించలేదన్నారు.నూకల బియ్యం వస్తున్నాయని తెలిసి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.లడ్డూకి రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ముఖ్యమని, ముడిసరుకుల్లో ఉన్న లోపాలను కూడా గుర్తించామన్నారు.ఇకపై బెస్ట్ క్వాలిటీ నెయ్యి తెప్పించి, గతంలో స్వామి లడ్డూకి ఉండిన వైభవాన్ని మళ్లీ తీసుకొస్తామన్నారు.ఇకపై నాణ్యత కలిగిన ముడిసరుకులు ఇవ్వకపోతే జరిమానా విధిస్తామన్నారు.తిరుమలలో కొన్ని రెస్టారెంట్లు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. కనీసం పరిశుభ్రత పాటించకపోవడంతో పాటు నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను భక్తులకు విక్రయిస్తున్నారన్నారు. ఇకపై తక్కువ ధరలతో పాటు నాణ్యత ఉండాలని హోటళ్ల నిర్వాహకులను ఆదేశించామన్నారు. రెస్టారెంట్లు తీసుకునేవారితో పాటు టూరిజం హోటళ్లను కూడా సబ్ లీజ్‌కు ఇవ్వకూడదనే నిబంధన పెడతామన్నారు. ప్రముఖ హోటళ్ల నిర్వాహకులకే ఇకపై రెస్టారెంట్లు కేటాయించే నిబంధన పెడతామన్నారు.గతంలో టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతోందని, ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. గతంలో అన్నప్రసాదాలు బాగాలేవని చెప్పిన భక్తులపై పెట్టిన కేసుల ఉపసంహరణపై పరిశీలిస్తామన్నారు. టీటీడీ ఉద్యోగులు చాలా కష్టపడి పనిచేస్తున్నారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

గూడూరు పట్టణ అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే

గూడూరు, జూలై 20: గూడూరు పట్టణాన్ని అభివృద్ధిపరిచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టణంలో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. ప్రధానంగా పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు, డ్రైనేజీ కాలువలను, సీసీ రోడ్లను అభివృద్ధిపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు వార్డులలో వెలగని వీధిదీపాలను గుర్తించి ఏర్పాటు చేయాలన్నారు. చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నరసింహులు, ఇజ్రాయిల్‌కుమార్, వాటంబేడు శివకుమార్, రవీంద్రరెడ్డి, గురవయ్య, పరమేశ్వర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

సూళ్లూరుపేట, జూలై20: గురుకుల పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో చంద్రముని అన్నారు. శనివారం ఆయన అంబేడ్కర్ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులుండే గదులు, వంటచేసే ప్రాంతం, పరిసరాలను పరిశీలించారు. గురుకులం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని సిబ్బందితో కలిసి తొలగించారు. ఆర్డీవో మాట్లాడుతూ వారంలో రెండురోజులు పరిసరాల శుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రిన్సిపాల్ గురుప్రసూనను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఉన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాలి

సూళ్లూరుపేట, జూలై 20: మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం సూళ్లూరుపేటలో ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచేంద్ర మాట్లాడుతూ గడిచిన నెల రోజుల్లో రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని, ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తెచ్చి కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారం నిర్వహించారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు

సూళ్లూరుపేట, జూలై 20: సూళ్లూరుపేట తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బదిలీపై గుంటూరుకు వెళ్లడంతో శనివారం ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్డీవో చంద్రముని మాట్లాడుతూ ఆయన పనిచేసిన ఆరు నెలల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సేవలను అందించారన్నారు. అనంతరం తహసీల్దార్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగప్రసాద్, తడ తహశీల్దార్ ఇక్బాల్, టీడీపీ నేత తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పేదలకు సామాజిక సేవలు అందిస్తాం'

నాయుడుపేట టౌన్, జూలై 20 : పేదలకు ఆరోగ్య, సామాజిక సేవలను అందిస్తామని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ బాలాజీ రాజు అన్నారు. నాయుడుపేట సంజాయ్‌గాంధీ కాలనీలో శనివారం ఆ ప్రాంత ప్రజల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఏవైనా ఆరోగ్యసమస్యలున్నా, సంక్షేమం, అభివృద్ధి పథకాలలో, అవసరమైన సామాజిక సేవలను సంబంధిత అధికారులతో సంప్రదించి ఉచితంగా సేవలు అందిస్తామని తెలిపారు. ఈ నవజీవన్ సంస్థ సిబ్బంది ఎం.లక్ష్మి, కె.భారతీ, కె.చెంగమ్మ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

దొరవారిసత్రం,జూలై20:ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్‌లో కచ్చితంగా హెల్మెట్ ధరించాలని నాయుడుపేట రూరల్ సీఐ జగన్మోహన్‌రావు కోరారు. శనివారం ఆయన దొరవారిసత్రం మండల పరిధిలోని టోల్ ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎస్‌ఐ తిరుమలరావులతో కలిసి ఆయన వాహనాల తనిఖీ చేసే క్రమంలో వందల సంఖ్యలో పారిశ్రామిక వాడల నుంచి కార్మికులు ద్విచక్ర వాహనాల్లో వస్తుండడం గమనించి వారందరిని నిలుపుదల చేశారు. వారికి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు.

ఏఎస్‌ఐకి ఎస్పీ ప్రశంస



తడ, జూలై 20: తడ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ శ్రీకుమార్‌రెడ్డిని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ప్రశంసిస్తూ రివార్డును అందజేశారు. గత మంగళవారం తడలో సతీష్‌కుమార్ అనే వ్యక్తిపై హత్యాయత్నం జరగడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చెన్నైకు తరలించి చికిత్స అందించారు. ఆ సమయంలో బి నెగిటివ్ రక్తం సదరు గాయపడ్డ వ్యక్తికి అత్యవసరంగా ఎక్కించాల్సి వచ్చింది. ఆ సమయంలో అతడితోపాటు ఉన్న ఏఎస్‌ఐ శ్రీకుమార్‌రెడ్డి తన రక్తం కూడా బి నెగిటివ్ కావడంతో క్షణం ఆలస్యం చేయకుండా రక్తదానం చేసి ఆ వ్యక్తిని కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఏఎస్‌ఐను తిరుపతికి పిలిపించి ఆయన చేసిన పనిని ప్రశంసిస్తూ రివార్డు అందజేశారు. అభినందించిన వారిలో ఎస్పీతోపాటు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్‌ఐ నరసింహరావు ఉన్నారు.

పుట్టాలమ్మకు ప్రత్యేక పూజలు



కోట, జూలై 20 : చెందోడు గ్రామదేవత పుట్టాలమ్మ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. అర్చకులు అమ్మవారి విగ్రహానికి పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచారు. మహిళా భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం జరిగింది.

పంచాయతీ దుకాణాలు అర్హులకే ఇవ్వాలి

కోట, జూలై 20 : కోట పంచాయతీ దుకాణాలు అర్హులకే ఇవ్వాలని టీడీపీ ఎంపీటీసీలు దారా సురేష్, షేక్ షంషుద్దీన్, యానాటి నారాయణ డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. కోట మేజర్ పంచాయతీలో వేలంపాటల ద్వారా తక్కువ ధరలకు దుకాణాలు దక్కించుకొని బినామీలు ద్వారా ఎక్కువ ధరలకు వేరే వ్యక్తులకు దుకాణాలు ఇస్తున్నారన్నారు. దీనిపై నిఘా ఉంచాలన్నారు. అదే విధంగా మండల పరిషత్‌లో నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాలన్నారు.

జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్‌గా కమ్మపల్లివాసి

డక్కిలి, జూలై 20 : అనంతపురం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా డక్కిలి మండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన ప్రొఫెసర్ సంక్రాంతి కృష్ణయ్యను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా కృష్ణయ్య రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించడం ఇది రెండో సారి. తమ గ్రామ వాసిని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా నియమించడం తమకు ఎంతో గర్వంగా వుందని గ్రామస్తులు తెలిపారు. కృష్ణయ్య విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే జరిగిందని గ్రామస్తులు తెలిపారు. కృష్ణయ్యను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఫోన్‌లో అభినందించారు.

పాము కాటుతో కూలీ మృతి



చిట్టమూరు, జులై 20: మండల పరిధిలోని గునపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ వల్లిపేడు కుమార్(35) శనివారం పాముకాటుకు గురై మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... కుమార్ వరి పొలంలో పురుగు మందు పిచికారీ చేసేందుకు కూలీ పనికెళ్లాడు. పొలంలో దిగి స్ప్రే చేస్తుండగా పురుగు కుట్టిందని తోటి కూలీకి చెప్పాడు. కుమార్‌ను తీసుకొని తొలత గునపాటి పాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, మెరుగైన చికిత్స కోసం నాయుడుపేటకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు పొలం యజమాని తెలిపారు. మృతుడికి భార్య, తల్లిదండులు ఉన్నారు.

మేరీ వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత

నాయుడుపేట, జూలై20: నాయుడుపేట సంజాయ్‌గాంధీ కాలనీలోని మేరీ వృద్ధాశ్రమానికి శనివారం స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్యోగస్తులు బియ్యం, పప్పు దినుసులు, నూనె, కాస్మోటిక్ తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 117 వార్షికోత్సవం సందర్భంగా వీటిని అందజేసినట్లు బ్యాంక్ మేనేజర్ వికాశ్ తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు బెన్నిసునీతను అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ జోష్ను, బిజినెస్ అసోసియేట్స్ కిషోర్, రాజేశ్వరి ఉన్నారు.

నేడు గురు పౌర్ణమి పూజలు

గూడూరు, జూలై 20: గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక సాయినగర్‌లోని షిరిడి సాయిబాబా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. ఈనెల 14వ తేదీ నుంచే స్వామివారికి భజనలు, సాయిసప్తాహం, హరతి పూజలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

రెడ్ల రాజ్యంగా రాయలసీమ

ఓ సామాజిక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడం సీమ చరిత్రకు దర్పణం ● బీఎస్పీ జోనల్ మీట్‌లో రిటైర్డు డీజీపీ పూర్ణచంద్రరావు



బీఎస్పీ సమావేశంలో ప్రసంగిస్తున్న పూర్ణచంద్రరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20: రాయలసీమ రెడ్ల రాజ్యంగా మారిందనీ.. ఒక వర్గం ఇతర వర్గాలను అణగదొక్కడమే ఇక్కడి చరిత్రకు దర్పణమని రిటైర్డు డీజీపీ, బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన బీఎస్పీ జోనల్ స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. బలిజలతో కలిసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు రాయలసీమలో 70 శాతం ఉన్నారని, అయితే కేవలం 8 శాతం మాత్రమే వున్న రెడ్డి సామాజిక వర్గం దశాబ్దాలుగా ఇతర కులాలను, మరీ ముఖ్యంగా ఎస్సీ, బీసీ వర్గాలను ఎదగనీయకుండా అడ్డుపడుతోందన్నారు. ఒక వైపు భయపెడుతూ మరో వైపు దోచుకుంటూ అన్ని ప్రధాన పార్టీల్లోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు రాజ్యమేలుతున్నారని వాపోయారు. గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మెజారిటీ స్థానాలు రెడ్లకే కేటాయించాయని ఆవేదన వ్యక్తం చేశారు.రిజర్వు సీట్ల వల్ల ఎస్సీలకు ఆ మాత్రం సీట్లున్నాయనీ, లేకపోతే వాటిని కూడా మాయం చేసి ఉంటారన్నారు.వైఎస్, పెద్దిరెడ్డి, జేసీ, భైరెడ్డి, నల్లారి, భూమన, శిల్పా, మేకపాటి తదితరుల వలలో చిక్కి రాయలసీమ సర్వనాశనం అయ్యిందన్నారు.కులగణన జరగకుండా సామాజిక న్యాయం జరగదని స్పష్టం చేశారు.బీఎస్పీ రాయలసీమ కో-ఆర్డినేటర్, రిటైర్డు జడ్జి గుర్రప్ప, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, ఉపాధ్యక్షులు గౌతం, నాయకులు మల్లిక, విజయకుమార్, జానకిప్రసాద్, సురేంద్ర, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోంది

హోంమంత్రి అనిత



భక్తులతో మాట్లాడుతున్న అనిత

తిరుమల, జూలై20(ఆంధ్రజ్యోతి):శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తుల ముఖాల్లో నవ్వు కనిపిస్తోందని హోంమంత్రి అనిత అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం అనిత ఆలయం ముందు భక్తులతో మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు చాలా ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నారన్నారు. గతానికంటే ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని, లడ్డూ, అన్నప్రసాదాల్లో నాణ్యత పెరిగిందని భక్తులు చెబుతున్నట్లు తెలిపారు. ఇదే ఆనందం భక్తుల్లో నిత్యం ఉండాలని కోరుకుంటున్నానన్నారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎన్డీయే కూటమిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. స్వామి ఆశీస్సులుంటే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుందనే నమ్మకం ఉందన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవ


ఊంజల్‌సేవ మండపంలో స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, జూలై 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రాత్రి పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ నేత్రపర్వంగా కొనసాగింది. మొదట ఆలయంలోని అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసకువచ్చారు. పౌర్ణమి వెండి కాంతుల్లో ఊంజల్‌సేవలో ఊయల ఊగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి ఐఐటీలో వార్షికోత్సవం

ఏర్పేడు, జూలై 20: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరవ వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా కో ఫౌండర్ ఆఫ్ ఇన్ఫోసిస్ ఛైర్మన్ క్రిస్ గోపాలకృష్ణ, అతిథులుగా జెస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ హాజరుకానున్నట్లు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. అతిథుల చేతుల మీదుగా ఐఐటీలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

చంద్రగిరి - రేణిగుంట బస్సు సర్వీసుల ప్రారంభం


బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

రేణిగుంట, జూలై 20: చంద్రగిరి - రేణిగుంట టౌన్ సర్వీసులను ఆర్టీసీ అధికారులు, బీజేపీ నాయకులు శనివారం ఉదయం ప్రారంభించారు. కొంతకాలంగా టౌన్ సర్వీసులు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చంద్రగిరి - రేణిగుంట టౌన్ సర్వీసులను పునఃప్రారంభించాలని కోరారు. శనివారం జెండాఊపి బస్సును ప్రారంభించారు. తేజావతి, ప్రేమ్‌రెడ్డి, భాస్కర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

రేణిగుంట, జూలై 20: రాష్ట్రీయ సేవా సమితి, ఏటీసీ హెల్పేజ్ ఇండియా సహకారంతో శనివారం కరకంబాడి పంచాయతీ పరిధిలో రాస్ కార్యాలయంలో వృద్ధు దివ్యాంగులు 40మందికి చేరి కర్రలు, 18మందికి ట్రైపాడ్స్, ఐదుగురికి ఎల్బో కర్చెస్, ఐదుగురికి వాకర్ స్టాండ్స్, ఇద్దరికి వీల్ ఛైర్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ సంచాలకులు నాగరాజు, ఇండియా ప్రాజెక్టు మేనేజరు పద్రిక్, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తెండి

రేణిగుంట, జూలై 20: రేణిగుంట ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన రేణిగుంట నుంచి రోజూ ఎంతోమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సమీపంలోనే రైల్వేస్టేషన్ ఉండటంతో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. ఆర్టీసీ బస్టాండులో ఉన్న మరుగుదొడ్డి రుసుం చెల్లించలేదని రెండు నెలలుగా మూసివేశారు. దీంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా రొట్టెల పండుగ


దర్గాలో పూజలు చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి, జూలై 20: పట్టణంలోని హజరత్ జులేషా పీర్ దర్గాలో శనివారం రొట్టెల పండుగ జరిగింది. దర్గా నిర్వాహకులు సయ్యత్ అహ్మద్, బాబా ఫరీద్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఒకరికొకరు రొట్టెలను ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి నాగేశ్వరరావు, రాజేశ్వరరావు, రమేష్‌బాబు, జమ్రుద్‌బాషా, కల్యాణమ్మ, పులి రామచంద్రయ్య, మహ్మద్ అన్సర్, దిలావర్ హుస్సేన్, జాకీర్, ఉదయ్ భాస్కర్ షేక్ షఫీ, కుప్పారావు, సుబ్బారెడ్డి, బావాజాన్, రహీమ్‌కాన్, సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జూలై 20: వడమాలపేట మండలం అప్పలాయిగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు భక్తుల గోవిందనామ స్మరణాలతో ఊంజల్‌సేవ నిర్వహించారు. సర్వాలంకర భూషితుడైన పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వెంకటే శ్వరస్వామిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు.

టీడీపీ నేతకు పార్టీ శ్రేణుల శుభాకాంక్షలు


ధనంజయులు నాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, జూలై 20: చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి, తుడా మాజీ డైరెక్టర్ ధనంజయులు నాయుడు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తల నడుమ ధనంజయులు నాయుడు కేక్ కట్ చేశారు. పూలమాలలు, శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూలై 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వైభవంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అభిషేకం అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, జూలై 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వేదపండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న ఉత్తర గోగ్రహణం


పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీదేవి

శ్రీకాళహస్తి, జూలై 20: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ఉత్తర గోగ్రహణం కార్యక్రమం ఆకట్టుకుంది. భారతంలో భాగంగా ఉత్తర గోగ్రహణం ఘట్టాన్ని వేషధారులు ప్రదర్శించారు. ఇక ఆలయంలో రోజువారి పూజలు యధావిధిగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక ఆదివారం సాయంత్రం అగ్నిగుండం కార్యక్రమం జరగనుంది. ఇందుకోసం భక్తులు శుక్రవారం నుంచి కంకణం ధరిస్తున్నారు.

నేడు అగ్నిగుండ మహోత్సవం

శ్రీకాళహస్తి, జూలై 20: ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సాయంత్రం 6గంటలకు అగ్నిగుండ ప్రవేశం ప్రారంభం కానుంది. పెద్దసంఖ్యలో భక్తులు తరలి రానున్న దృష్ట్యా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలను చేపట్టింది.

దుర్గమ్మకు ముక్కంటి సారె


పూజలు చేసుకుంటున్న సుధీర్‌రెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి, జూలై 20: విజయవాడ కనకదుర్గమకు శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే దంపతులు ముక్కంటి సారెను సమర్పించారు. ఆషాఢమాసం శాకంబరీ ఉత్సవాలకు సంబంధించి ఏటా ముక్కంటి ఆలయం తరపున సారె సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సారె అందజేశారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

లంపి స్కిన్ వ్యాధికి టీకాలు

పిచ్చాటూరు, జూలై 20: మండలంలోని గోవర్ధనగిరి పంచాయతీలో ఆవులు, గేదెలు, దూడలకు లంపి స్కిన్ వ్యాధి రాకుండా టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువులకు చర్మంపై పెద్దపెద్ద కురుపులు, దద్దుర్లు ఏర్పడతాయన్నారు. వీటిపై దోమలు, ఈగలు వాలి ఇతర పశువులకు వ్యాపింపచేస్తాయని తెలిపారు. లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువుల్లో ఒకటి నుంచి రెండు శాతం మాత్రమే మరణాలు సంభవిస్తాయని, ఇది మనుషులకు సోకదని స్పష్టం చేశారు. ఈగలు, దోమలు లేకుండా పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలని, లంపి స్కిన్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే పశువైద్యాధికారిని సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో అనిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్ కె.విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.25లక్షలు ఇవ్వాలి

ఏర్పేడు, జూలై 20: పుష్పిత్ స్టీల్ కర్మాగారంలో శుక్రవారం ప్రమాదవశాత్తు మృతి చెందిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బిక్రమ్(21) కుటుంబానికి రూ.25లక్షలు పరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, కార్యదర్శి పెనగడం గురవయ్య శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పుష్పిత్ స్టీల్ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని, కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు.

రాహు కేతు పూజల పేరుతో మోసం

- భక్తులను దగా చేస్తున్న దొంగస్వామి
- ప్రైవేటు లాడ్జీలు కేంద్రంగా సాగుతున్న తతంగం

శ్రీకాళహస్తి, జూలై 20: పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఓ బురిడీ స్వామి భక్తులను నిలువునా దగా చేస్తున్నాడు. గత మూడేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో దోష పరిహార పూజలు చేస్తానని నమ్మిస్తూ భారీగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నాడు. బాధితులు గగ్గోలు పెడుతూనే ఉన్నా ఇప్పటి వరకు అధికారులు కనీస చర్యలు చేపట్టలేదు. అడిగేవారే లేకపోవడంతో రాహుకేతు పూజల పేరుతో దొంగస్వామి తన మోసాలను కొనసాగిస్తూనే ఉన్నాడు. తాజాగా శుక్రవారం అనంతపురానికి చెందిన ఓ భక్తుడికి ఫోన్ చేసి దోషం పేరుతో భారీగా నగదు వసూలు చేసేందుకు విఫలయత్నం చేశాడు. అనంతపురానికి చెందిన నాగేంద్ర ఏప్రిల్ 4న శ్రీకాళహస్తికి విచ్చేశాడు. ముక్కంటి ఆలయంలో అర్చన విభాగంలో అటెండర్‌గా పనిచేసే ఓ ఉద్యోగికి సన్నిధివీధిలో ఉన్న లాడ్జీలో గదిని అద్దెకు తీసుకుని రాత్రి అక్కడే బస చేశాడు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు జరిపించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. శుక్రవారం గోవిందశర్మ అనే పేరుతో ఓ వ్యక్తి నాగేంద్రకు ఫోన్ చేశాడు. ఫలాన తేదీన ముక్కంటి ఆలయంలో రాహుకేతు పూజలు జరిపించుకున్నారు కదా అని పరిచయం చేసుకున్నాడు. మీరు ఏ సమస్యపై రాహుకేతు పూజలు జరిపించుకున్నారంటూ విషయం రాబట్టాడు. వెంటనే ఫోన్‌పే ద్వారా 9063695327 నెంబరకు రూ.5,116 నగదు వేస్తే దోష పరిహారం కోసం పూజలు చేస్తానంటూ నమ్మించాడు. అప్పటికప్పుడే పూజ ప్రారంభం అవుతుందంటూ ఆలస్యం కాకుండా నగదు జమ చేయాలని నాగేంద్రను తొందరపెట్టాడు. అయితే తాను స్వయంగా శ్రీకాళహస్తికి వచ్చి నగదు చెల్లిస్తానని నాగేంద్ర చెప్పాడు. తాను ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రుల స్థాయివారితోనే మాట్లాడుతానని, నేరుగా కలిసేందుకు సమయం లేదంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. నాగేంద్ర శ్రీకాళహస్తిలోని తనకు పరిచయస్థులకు గోవిందశర్మ మాట్లాడిన వాయిస్ రికార్డును పంపాడు. నాగేంద్ర మిత్రుడు ఆరా తీయడంతో గోవిందశర్మ ఫోన్ స్విచ్చాఫ్ చేసేశాడు. ఈవిషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ఆగని బరితెగింపు

శ్రీకాళహస్తిలోని లాడ్జీల్లో బసచేసే వారి వివరాలను ఓ ఆగంతకుడు మూడు సంవత్సరాలుగా సేకరిస్తున్నాడు. భక్తులు బసచేసిన మూడు నెలల తరువాత వారికి ఫోన్లుచేస్తూ తేదీ, ఊరు, పేరు, సమయంతో సహా భక్తులతో మాట్లాడుతున్నాడు. వివరాలు పూర్తిగా చెబుతూ శ్రీకాళహస్తీశ్వరాలాయనికి చెందిన స్వామిగా వందలాది మందిని నమ్మించి మోసం చేస్తున్నాడు. చాలా మంది భక్తులు పలుమార్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గతంలో గోవిందశర్మ మోసాలపై ఫిర్యాదు చేశారు. కానీ చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఆగంతకుడు మరింతగా బరితెగిస్తున్నాడు.

పుత్తేరి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా: ఆదిమూలం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 20: మండలంలోని పుత్తేరి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం పుత్తేరి గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని ఎన్ఆర్ఐ పార్థసారధి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తాగునీరు, విద్యుత్, రోడ్ల మరమ్మతులు, సత్యవేడు నుంచి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుత్తేరి గ్రామం టీడీపీకి కంచుకోటని, ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలందరికీ తగు గుర్తింపునిచ్చి న్యాయం చేస్తామని తెలిపారు. విద్యార్థులకు కిట్లు, రైతులకు జీలగలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సర్పంచు రామూర్తి, ఎన్ఆర్ఐ పార్థసారధి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, అబ్జర్వర్‌ను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, డీటీ చంద్రబాబు నాయుడు, ఎంఈవో రవీంద్రనాథ్, ఏవో భారతి, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, మధునాయుడు, సుధాకర్ నాయుడు, వీరరాఘవులు, వెంకటాచలం, రాజేంద్ర, శ్రీనివాసులు, భూపయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

శ్రీకాళహస్తి, జూలై 20: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు శాస్త్రీయ పద్ధతితో బోధించాలని డీఈవో శేఖర్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ సాధన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ స్వీయ పథకంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు తన పరిధిలో పరిశీలన చేయాలన్నారు. పరిశీలించిన అంశాలను టీచ్ టూల్ యాప్‌ల అప్‌లోడ్ చేయాలని సూచించారు. శిక్షణానంతరం ఉపాధ్యాయులు 40 పాఠశాలలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో శివశంకరయ్య, అసిస్టెంట్ ఏఎంవో మధు, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి, జూలై 20: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ వర్మ శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు ఆ సొమ్మును స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 20: పౌర్ణమి సందర్భంగా ఆదివారం కైలాసగిరుల చుట్టూ గిరిప్రదక్షిణ చేసే భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు రేణుకా పరాశక్తి పీఠం నిర్వాహకులు తెలిపారు. గిరిప్రదక్షిణ మార్గంలోని 15వ కిలోమీటరు వద్ద రామాపురం మార్గంలో ఉదయం 6నుంచి రాత్రి 8గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

అన్నదానం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 20: టీడీపీ సీనియర్ నేత సముద్రాల రవి నాయుడు తండ్రి రాగయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ దగ్గర శనివారం అన్నదానం చేశారు.

నేడు వన్నెస్ యోగా

వరదయ్యపాళెం, జూలై 20: గోవర్ధనపురంలోని ఏకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గురు పౌర్ణమిను పురస్కరించుకుని వన్నెస్ యోగా, ధ్యానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మాఅమ్మ పేరుతో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు.

ప్రాణహాని ఉందన్నా పట్టించుకోరా?

ఏర్పేడు, జూలై 20: తిరుపతికి చెందిన పెద్దినాయుడు కుటుంబం నుంచి తమకు ప్రాణహాని ఉందని ఏర్పేడు మండలం గోవిందవరం గ్రామానికి చెందిన పేరం రమేష్ నాయుడు భార్య పేరం హేమలత ఈ నెల 16న పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత ఎనిమిదేళ్లుగా వీరి కుటుంబాల మధ్య భూ వివాదం ఉంది. ఈ క్రమంలో పెద్దినాయుడు కుటుంబం నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని హేమలత పోలీసులను కోరింది. ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడుస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని హేమలత ఆవేదన వ్యక్తం చేసింది.

విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించండి

కేవీబీపురం, జూలై 20: మండలంలోని కళత్తూరు దళితవాడలో గత వారంలో వీచిన పెనుగాలికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది.దీంతో సరఫరా లేక తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్తంభాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పచ్చిరొట్ట ఎరువులను త్వరగా పంపిణీ చేయండి

శ్రీకాళహస్తి, జూలై 20: వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువులను త్వరగా పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయాధికాఆర ఎస్.ప్రసాద్ రావు సూచించారు. ఏపీ సీడ్స్ కార్యాలయంలో జిల్లా మేనేజరు సంపత్‌తో కలిసి వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. పచ్చిరొట్ట ఎరువుల సరఫరా గురించి ఆరా తీశారు. త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం తొట్టంబేడు మండలం పొయ్య రైతు సేవా కేంద్రంలో కౌలుదారులకు గుర్తింపుకార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీపీపీ ధనంజయరెడ్డి, ఏడీఏ రమేష్, సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరరాజాలో లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు


డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రేణిగుంట, జూలై 20: అమరరాజా పరిశ్రమలో లారీ డ్రైవర్లకు రాజన్న ఫౌండేషన్, ఎస్వీ అరవింద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 200మంది లారీ డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించు కున్నారు. అమర రాజా గ్రూప్ సప్లై ప్రెసిడెంట్ వెంకట్ మాధవ్ మాట్లాడుతూ కంపెనీకి సరుకు, వస్తువుల రవాణాలో డ్రైవర్లు ముఖ్యపాత్ర పోషిస్తారని, డ్రైవింగ్ సమయంలో కంటిచూపు సన్నగిల్లడం వల్ల ప్రమాదాలు జరిగే ఉందన్నారు కంటి పరీక్షల ద్వారా డ్రైవర్లు వారి ఐ విజన్ మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు చంద్రబాబు రాజు, సతీష్, డాక్టర్ శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకులో ఆన్‌లైన్ లోన్ అప్లికేషన్ ప్రారంభం

తిరుపతి అర్బన్, జూలై 20: టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకులో శనివారం నుంచి ఆన్‌లైన్ లోన్ అప్లికేషన్ ప్రారంభించినట్లు ఆ బ్యాంకు ఉపాధ్యక్షుడు చీర్లకిరణ్ తెలిపారు. గతంలో ఉన్న మ్యాన్యువల్ విధానంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదురవుతుండటంతో నూతన విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం హెచ్‌టీటీపీఎస్://ఈహెచ్‌ఆర్‌ఎమ్‌ఏపీఎస్.తిరుమల.ఓఆర్‌జీ ద్వారా అప్లికేషన్‌ను బ్యాంకుకు పంపవచ్చన్నారు.

2,560 మందికి ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ లైసెన్స్



సర్టిఫికెట్లు అందుకున్న అభ్యర్థులతో వెంకటేశ్వర్లు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 20: కడప జోన్-4లోని ఎనిమిది జిల్లాల శిక్షణ కేంద్రాల ద్వారా 2,560మంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందారని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తిరుపతికి పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆయన అలిపిరి డిపో గ్యారేజీని సందర్శించారు. ప్రవేశద్వారం వద్ద మామిడి మొక్కను నాటారు. అనంతరం ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. డ్రైవింగ్ స్కూల్‌కు చేరుకుని హెవీ డ్రైవింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న 27వ బ్యాచ్‌కుచెందిన 16మందికి సర్టిఫికెట్లు అందజేశారు. 28వ న్యూ బ్యాచ్‌ను ఆహ్వానించి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈనెల 22నుంచి 29వ బ్యాచ్‌కు అప్లికేషన్ జారీచేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ సులభతరంగా హెవీడ్రైవింగ్ శిక్షణ పొందడానికి ఆర్టీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతగా పరిగణించి ఈ కేంద్రాలను 2020అక్టోబరులో ప్రారంభించినట్లు గుర్తు చేశారు. తక్కువ ఖర్చుతో యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డిపోలోని పలువిభాగాలను తనిఖీ చేసి, సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంఈ నరసింహులు, డిపో మేనేజర్ హరిబాబు, పుష్పలత, ప్రభాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి పోటెత్తిన భక్తులు



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 20: తమిళనాడు తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు తరలివెళ్లేందుకు శనివారం సెంట్రల్ బస్సు స్టేషన్‌లో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి తిరుపతి బస్టాండు తిరువణ్ణామలై ప్రయాణికులతో నిండిపోయింది. ఒకానొక దశలో బస్సులు కొరత ఏర్పడటంతో సీట్ల కోసం పోటీపడ్డారు. ఈ పరిస్థితి సాయంత్రం వరకు కొనసాగింది. ఆదివారం మధ్యాహ్నం వరకు ప్రత్యేక బస్సులు తిరువణ్ణామలైకి నడవనున్నాయి.

నేడు సీపీఎం సమావేశం

తిరుపతి(ఆటోనగర్), జూలై 20: సీపీఎం జిల్లా విస్తృత సమావేశం ఆదివారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలో మహిళలపై, చిన్న పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలపై సుదీర్ఘ చర్చ జరుగుతుందన్నారు. అలాగే ఉద్యోగ, కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా చర్చ ఉంటుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.సుబ్బారావుతోపాటు జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సచివాలయాల ప్రక్షాళన తప్పనిసరి



- 37శాతం గ్రామ సచివాలయాల్లో 5శాతం లోపు సేవలు
- సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ సంస్థ అధ్యయనం
- నివేదికను తొక్కిపెట్టిన సచివాలయ శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థలో లోపాలు, దాని బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ (సీపీఆర్) సంస్థ జగన్ హయాంలోనే అధ్యయనం చేసింది. ఈ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. అయితే ఈ సంస్థ ఇచ్చిన నివేదిక అప్పటి ప్రభుత్వ పెద్దల మనోభావాలకు వ్యతిరేకంగా ఉందనే ఉద్దేశంతో దాన్ని బహిర్గతం చేయడానికి గ్రామ, వార్డ్ సచివాలయ శాఖ అధికారులు సాహసించలేదు. సచివాలయ వ్యవస్థ ఎందుకు?, దానిలో ఎలాంటి మార్పులు చేపట్టాలి?, ఉన్న వ్యవస్థను ఎలా మలచుకుంటే ప్రజలకు విస్తృతంగా ఉపయోగపడుతుందన్న అంశాలపై ప్రస్తుతం చర్చ సాగుతున్న నేపథ్యంలో సీపీఆర్ అధ్యయనం అంశం తెరపైకి వచ్చింది.

సంస్థాగత పాత్ర

గ్రామ, వార్డ్ సచివాలయ వ్యవస్థకు సంబంధించి నాలుగు అంశాల ఆధారంగా సీపీఆర్ అధ్యయనం చేసింది. సంస్థాగత పాత్ర, సంస్థ నిర్మాణం, మానవ వనరులు, కార్యకలాపాలపై అధ్యయనం చేసి ప్రక్షాళన కోసం పలు సూచనలు చేసింది. సచివాలయాలు స్థానిక సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు సూచించడం లేదని, స్థానిక సామాజిక ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించి నిర్వహించడం లేదని నివేదికలో పేర్కొన్నారు. వ్యక్తిగత పథకాల ప్రయోజనాలపైనే సచివాలయాలు ఎక్కువగా దృష్టి సారించాలి. సామాజిక మౌలిక వసతులతో పాటు ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి. తాగునీరు, విద్యుత్ విషయంలో భాగస్వామ్యం కావాలి. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు ఇప్పటికే ఆయా శాఖాపరమైన వ్యవస్థలున్నందున వాటిలో జోక్యం చేసుకోవడంలో అర్థం లేదు.

సమస్యల పరిష్కారం ఇలా...

స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగు ప్రణాళికలు రూపొందించి అమలు చేసే విధంగా గ్రామ, వార్డ్ సచివాలయాలను విస్తృతపరచాలని నివేదికలో సూచించారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను మండల కార్యాలయం స్థాయిలో ఆయా ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా పరిష్కరించాలి.

సంస్థాగత నిర్మాణం

రాష్ట్రంలో పలు గ్రామ, వార్డ్ సచివాలయాలపై పని భారం వేర్వేరుగా ఉంది. 37శాతం గ్రామ సచివాలయాలు, 39.3 శాతం వార్డ్ సచివాలయాలు 2022 నవంబరు- 2023 మే నెలల మధ్యకాలంలో నెలకు కేవలం 5శాతం లోపు సేవలు మాత్రమే అందించాయి. గ్రామ పంచాయతీలకు సమాంతర వ్యవస్థలుగా గ్రామ సచివాలయాలు ఉన్నా వీటి మధ్య సంబంధాలు అస్పష్టంగా ఉన్నాయి. గ్రామ, వార్డ్ సచివాలయాలు సామాజిక లక్ష్యాలను సాధించే శాఖలుగా కాకుండా పలు శాఖలకు ఔట్‌పోస్టులుగా మారాయి.

పంచాయతీల నియంత్రణ సరికాదు

గ్రామ, వార్డ్ సచివాలయాలకు సంబంధించిన కొన్ని సేవలను ఇతర సచివాలయాలతో అనుసంధానమై అందించాలి. గిరిజన ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాల్లో సామాజిక చైతన్యం, అవగాహన కల్పించేందుకు అదనపు సిబ్బందిని నియమించుకోవాలి. వార్డ్ సచివాలయాల్లో ఒక కార్యదర్శికి ఒకేషనల్ కౌన్సెలింగ్, శిక్షణలో తర్ఫీదు ఇవ్వాలి. గ్రామ పంచాయతీలకు సచివాలయాలపై పూర్తి నియంత్రణ సరికాదు. సామాజిక సంస్థలు, స్వయం సహాయక బృందాలతో కలిసి గ్రామ, వార్డ్ సచివాలయాలు కచ్చితంగా పనిచేయాలి.

మానవ వనరులు... పనిభారం

గ్రామ సచివాలయాల్లో జీవనోపాధి అంశాలు, వ్యవసాయం, పశుసంవర్థకం తదితర విభాగాలకు ప్రత్యేకంగా మానవ వనరులున్నాయి. కానీ వార్డ్ సచివాలయాల్లో లేవు. ఎనర్జీ కార్యదర్శులు మాత్రం రెండుచోట్లా ఉన్నారు. ఏఎన్ఎం, రెవెన్యూ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు గతంలోనూ ఉన్నారు. సచివాలయాల ఏర్పాటుతో వారి సంఖ్య పెరిగింది. సచివాలయ కార్యదర్శులు మంచి విద్యార్హతలు కలిగి ఉన్నారు. వారికి నిరంతర సాంకేతిక శిక్షణ అవసరం. అయితే శిక్షణ ఇచ్చే సంస్థలు రాష్ట్రంలో లేవు.

సెమీ అర్బన్‌లో సిబ్బందిని పెంచాలి

వార్డ్ సచివాలయాల్లో పనిచేసే రెవెన్యూ కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్, శానిటేషన్ కార్యదర్శులను తగ్గించాలి. సెమీ అర్బన్ ప్రాంతాల్లో సిబ్బందిని పెంచుకోవాలి. సచివాలయ కార్యదర్శులకు ఎన్జీఓల సహకారంతో శిక్షణ అందించాలి. పని లేని గ్రామ, వార్డ్ సచివాలయాల్లో వలంటీర్లను తగ్గించాలి.

పని విభజనకు మార్గదర్శకాలు

గ్రామ, వార్డ్ సచివాలయాల పర్యవేక్షణ, నిర్వహణ జిల్లా, మండల కార్యాలయాలకు మారింది. అటెండెన్స్ లాగిన్, రిపోర్టులు, డేటా తదితరాల భారం తగ్గించాలి. సిబ్బందికి కార్యాలయాల్లో పనిచేసేందుకు ప్రాధాన్యత క్రమం ఇచ్చి, పనివిభజనకు స్పష్టమైన మార్గదర్శకాలివ్వాలి. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆయా శాఖల మధ్య సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలి. మండల కార్యాలయాల్లో సిబ్బందిని పెంచాలి. కార్యదర్శులు కచ్చితంగా శిక్షణ పొందాలి.



ఎమ్మెల్యే ఆరణిని సన్మానిస్తున్న నాయకులు

టీడీఆర్ బాండ్ల స్కాంపై విజిలెన్స్ విచారణ అవసరం

- సీఎం, డిప్యూటీ సీఎంలను కోరతానన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సంచలనం రేపిన టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరిపించమని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరుతానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 5 నుంచి 9 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కృతజ్ఞతా సమావేశం జేబీ నివాసంలో శనివారం జరిగింది. భారీ మెజారిటీ తెప్పించిన అందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. ఐదేళ్లగా ఎన్డీఏ శ్రేణులపై పెట్టిన కేసులను సీఎంకు చెప్పి ఎత్తివేయిస్తానని చెప్పారు. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిలు ప్రజలను చాలా ఇబ్బందులు పెట్టించారని, అత్యధిక మెజారిటీ వెనుక కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. తన గెలుపు తిరుపతి ప్రజలదన్నారు. ప్రశాంతవాతావరణం, అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. తిరుపతిలో భూమనకు ప్రజా బలం లేదన్నారు. దొంగ ఓట్లతో గెలవాలని చూసినా ప్రజలు తిరస్కరించారన్నారు. ఎపిక్ కార్డుల కుంభకోణంలో కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిలకు శిక్ష పడేలా చేస్తానన్నారు. ఆరణి మదన్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రమణ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళకు చేయూత



సుజాతమ్మను పరామర్శిస్తున్న మునికృష్ణ

తిరుపతి,జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ రెండు కాళ్లకు తీవ్ర గాయాలైన తెలుగు మహిళ నగర కార్యదర్శి సుజాతమ్మకు 35డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అండగా నిలిచారు. శనివారం ఆమెనివాసంలో పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. 35వ డివిజన్‌కు చెందిన సుజాతమ్మ పార్టీ కార్యక్రమాలకు హాజరవుతుండగా మెట్లపై నుంచి జారిపడి రెండు కాళ్లు దెబ్బతిన్నాయని, మెరుగైన చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించనున్నట్టు ఆర్సీ చెప్పారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, జగన్నాథం, యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మి, రవితేజ నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, హేమంత్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో పచ్చదనాన్ని పెంపొందిద్దాం



మొక్కలు నాటుతున్న అప్పారావు, భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 20: వర్సిటీ ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంపొందిద్దామని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కోరారు. వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో శనివారం వారు పాల్గొన్నారు. పచ్చదనాన్ని పరిరక్షించడం, పెంపొందించే కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉద్యోగులు భాగస్వామ్యం వహించాలని సూచించారు. వర్సిటీ ఇంజనీర్, నందనం అకాడమీ అధ్యక్షుడు పత్తిపాటి వివేక్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, సీనియర్ నాయకులు డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, డాక్టర్ డి.ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం, లడ్డూ నాణ్యతలో లోపాలు గుర్తించాం



- మార్పులు చేశామన్న టీటీడీ ఈవో

తిరుమల, జూలై20(ఆంధ్రజ్యోతి):శ్రీవారి భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం, లడ్డూల నాణ్యతలో లోపాలు గుర్తించామని, వాటి నాణ్యత పెంపుకోసం ఇప్పటికే చాలా మార్పులు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు.తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.క్యూలైన్లో భక్తులకు ఆహారపదార్థాలు, పిల్లలకు పాలు అందడం లేదని, సాంబారన్నం నాణ్యత బాగలేదని, సమస్య చెప్పుకుందామని చూస్తే అందుబాటులో ఏ అధికారీ లేరని ఫిర్యాదులందిన క్రమంలో క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లలో నిరంతరాయం ఆహారపదార్థాలు అందించేందుకు ప్రత్యేకంగా మూడు షిఫ్టుల్లో ఏఈవో స్థాయి అధికారులను నియమించామన్నారు.మరుగుదొడ్లను రెట్టింపు చేయడంతో పాటు కొన్ని చోట్ల శాశ్వత క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పదార్థాలతో స్వామికి నైవేద్యం సమర్పిస్తున్నారని,అయితే అవి ఆర్గానిక్ కాదనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.కాబట్టి సేంద్రియ పదార్థాలా కాదా అనే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో రైస్, సాంబారు, మజ్జిగ వంటి పదార్థాల్లో నాణ్యత కనిపించలేదన్నారు.నూకల బియ్యం వస్తున్నాయని తెలిసి రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు.లడ్డూకి రుచి, సువాసన రావాలంటే నాణ్యమైన నెయ్యి ముఖ్యమని, ముడిసరుకుల్లో ఉన్న లోపాలను కూడా గుర్తించామన్నారు.ఇకపై బెస్ట్ క్వాలిటీ నెయ్యి తెప్పించి, గతంలో స్వామి లడ్డూకి ఉండిన వైభవాన్ని మళ్లీ తీసుకొస్తామన్నారు.ఇకపై నాణ్యత కలిగిన ముడిసరుకులు ఇవ్వకపోతే జరిమానా విధిస్తామన్నారు.తిరుమలలో కొన్ని రెస్టారెంట్లు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. కనీసం పరిశుభ్రత పాటించకపోవడంతో పాటు నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను భక్తులకు విక్రయిస్తున్నారన్నారు. ఇకపై తక్కువ ధరలతో పాటు నాణ్యత ఉండాలని హోటళ్ల నిర్వాహకులను ఆదేశించామన్నారు. రెస్టారెంట్లు తీసుకునేవారితో పాటు టూరిజం హోటళ్లను కూడా సబ్ లీజ్‌కు ఇవ్వకూడదనే నిబంధన పెడతామన్నారు. ప్రముఖ హోటళ్ల నిర్వాహకులకే ఇకపై రెస్టారెంట్లు కేటాయించే నిబంధన పెడతామన్నారు.గతంలో టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. గతంలో అన్నప్రసాదాలు బాగాలేవని చెప్పిన భక్తులపై పెట్టిన కేసుల ఉపసంహరణపై పరిశీలిస్తామన్నారు. టీటీడీ ఉద్యోగులు చాలా కష్టపడి పనిచేస్తున్నారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూలై 20: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. వారోత్సావాల సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠించి, ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరింపజేశారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల సమాచారమివ్వండి

ఆర్టీఐ ద్వారా కోరిన నవీన్ కుమార్ రెడ్డి

తిరుపతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన టీడీఆర్ బాండ్ల పూర్తి సమాచారం ఇవ్వగలరని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి కోరారు. ఆమేరకు శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఆర్టీఐ అధికారికి దరఖాస్తు చేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో కోర్టు వ్యవహారాలు, నోటీసులకు సంబందించిన సమాచారంతోపాటు కార్పొరేషన్ అధికారులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు ఇచ్చిన వాల్యుయేషన్ సర్టిఫికెట్ కాపీలు కావాలని దరఖాస్తులో కోరారు. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరుతో టీడీఆర్ బాండ్ల ముసుగులో జరిగిన భారీ దోపిడీపై హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వాజ్యం (పిల్) వేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ఆయన ఈసందర్భంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసిన వ్యవసాయ భూములను కమర్షియల్‌గా ఎలా మార్చారు? రెసిడెన్షియల్ నుంచి కమర్షియల్ పరిధిలోకి ప్రభుత్వ అనుమతితో తీసుకొని వచ్చారా? కౌన్సిల్ తీర్మానం ఉందా? నగర అభివృద్ధి కోసం కొంతమంది స్వచ్ఛందంగా మరి కొంతమంది దగ్గర అధికారులను అడ్డం పెట్టుకొని అధికార పార్టీ నాయకులు బలవంతంగా లాక్కున్న తరతరాలుగా అనుభవిస్తున్న భూములకు సక్రమంగా టీడీఆర్ బాండ్లు ఇవ్వకుండా కమీషన్ల కోసం నిలిపివేశారా? రాజకీయ నాయకులు వేధించడం వాస్తవమా కాదా? మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసిన కొన్ని స్థలాలలో కోర్టు కేసులు పెండింగ్లో ఉన్నాయని అలాంటి వాటికి టీడీఆర్ బాండ్లు ఎలా ఇచ్చారో తెలపాలని వంటి ప్రశ్నలను అడిగారు.

రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్య



తిరుపతి అర్బన్, జూలై 20: రేణిగుంట ప్రధాన రోడ్డులోని ఫస్ట్‌రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు తీవ్రతరమవుతోంది. రైల్వే గేటు పడిందంటే చాలు వాహనాలు హీరో షోరూం ముందు వరకు బారులు తీరుతున్నాయి. దీంతో రేణిగుంట రోడ్డులో రాకపోకల సాగిస్తున్న వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సాయంత్రంపూట ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ రోడ్డు ఇరుకుకావడం, ఓపెన్ డ్రైనేజీ ఉండటం, మధ్యలో డివైడర్ కూలిపోవడం, వలయం లేకపోవడం, భారీ తోరణం అడ్డుగా ఉండడం కూడా ట్రాఫిక్ కష్టాలకు కారణమవుతున్నాయి. ఈ సమస్యకు సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలని జనం కోరుతున్నారు.

సైబర్ క్రైం ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి: ఎస్పీ



సైబర్ క్రైం కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేరవిభాగం), జూలై 20: సైబర్ క్రైంకు వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించి, పరిష్కరించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. శనివారం నగరంలోని పోలీసు కంట్రోలు రూము, సైబర్ క్రైం ఆఫీసులను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ పనితీరుతో ప్రజల్లో పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచాలని కోరారు. మొబైల్ హంట్ పనితీరును ప్రశంసించారు. అదనపు ఎస్పీ కులశేఖర్, సీఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఓ వ్యక్తికి రక్తదానం చేసి.. ప్రాణం కాపాడిన తడ ఏఎస్ఐ పి.కుమార్ రెడ్డికి ఎస్పీ రివార్డు అందజేశారు.

జిల్లావ్యాప్తంగా నాకాబందీ

ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. 54 ప్రాంతాల్లో రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. చెర్లోపల్లె జంక్షన్, అలిపిరి, లీలామహల్, ఆర్టీవో ఆఫీసు, తదితర ప్రాంతాల్లో ఎస్పీ స్వయంగా అదనపు ఎస్పీ కులశేఖర్‌తో కలసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రహదారి భద్రత తప్పకుండా పాటించాలని ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కపిలేశ్వర స్వామి ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి (కల్చరల్), జూలై 20: కపిలేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం యాగశాల పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టు పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం పంచమూర్తులు సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, వళ్లిదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి, చండికేశ్వర స్వామి వారి వీధి ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.





స్వామి, అమ్మవార్లకు హారతి - పంచమూర్తుల ఊరేగింపు

22లోగా రిపోర్టు చేయకుంటే ఇంజనీరింగ్ సీటు రద్దు

సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టీకరణ

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు నిర్దేశిత గడువులోగా కాలేజీల్లో, వెబ్‌సైట్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేనిపక్షంలో సీటు రద్దు అవుతుందని సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ బీనవ్య స్పష్టం చేశారు. ఈ నెల 17న తొలిదశ కౌన్సెలింగ్ సీట్లు కేటాయించామని, విద్యార్థులు 22లోగా కాలేజీల్లో, ఆన్‌లైన్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఒకవేళ రిపోర్టు చేయకపోతే ఆ సీటు రెండో విడత కౌన్సెలింగ్‌కు ఖాళీగా ఉన్నట్లు కనిపిస్తుందని తెలిపారు. కాలేజీల యాజమాన్యాలు కూడా విద్యార్థులు రిపోర్టు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌డేట్ చేయాలని, 23నాటికి అడ్మిషన్లు పొందిన అందరు విద్యార్థుల వివరాలు కచ్చితంగా అప్‌డేట్ చేయాలని సూచించారు.

సీపీఐ శ్రేణులపై కేసులు ఎత్తివేయండి

మంత్రి లోకేశ్‌కు రామకృష్ణ, ముప్పాళ్ల విజ్ఞప్తి

అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వివిధ ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న సీపీఐ, అనుబంధ ప్రజాసంఘాల శ్రేణులపై నమోదు చేసిన కేసులను కొత్త ప్రభుత్వం తొలగించాలని సీపీఐ రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చర్చించారు. తమ పార్టీ శ్రేణులపై నమోదైన కేసుల వివరాలతో కూడిన జాబితాను మంత్రికి అందజేశారు. దీనిపై లోకేశ్ సానుకూలంగా స్పందించారని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు సీపీఐ నేతలు తెలిపారు.

వెటర్నరీ ఇన్‌చార్జి వీసీ బాధ్యతల స్వీకారం



జేవీ రమణకు అభినందనలు తెలుపుతున్న అధికారులు

తిరుపతి రూరల్, జూలై 20: ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి వెటర్నరీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇన్‌చార్జి వీసీని రిజిస్ట్రార్ చెంగల్వరాయులు, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సీహెచ్ శ్రీలత, వెటర్నరీ డీన్ కె.వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

చంద్రగిరి, జూలై 20: చంద్రగిరి పట్టణంలోని ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 26వ తేదీనుంచి 13 రోజుల పాటు పురుషులకు ఇన్‌స్టాలింగ్, సర్వీసింగ్ ఆఫ్ సీసీ కెమెరా, సెక్యూరిటీ అల్లారమ్, స్మోక్ డిటెక్టర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆసంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బియ్యం కార్డు ఉన్న తిరుపతి, చిత్తూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 19-45 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ పురుషులు ఈశిక్షణకు అర్హులన్నారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రానుపోను ఒకసారి చార్జీలు ఇవ్వనున్నారు. బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేయనున్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 79896 80587, 94949 51289, 63017 17672 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీకి అభినందన



అప్పారావును అభినందిస్తున్న ప్రకాష్‌రెడ్డి, అధ్యాపకులు

తిరుపతి రూరల్, జూలై 20: ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ అప్పారావును బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ (రిమ్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జె. ప్రకాష్‌రెడ్డి శనిశారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఎంబీఏ హెడ్ డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


కాకినాడలో కారు ఢీకొట్టాక చెల్లాచెదురుగా పడివున్న మృతదేహాలు

కొత్తకారు.. మద్యంమత్తు
అర్ధరాత్రి 2 ద్విచక్రవాహనాలతో ఢీ

- ఆ తర్వాత డివైడర్‌పైకి దూసుకెళ్లి పల్టీ
- అక్కడికక్కడే ఇద్దరు దుర్మరణం .. మరో ఇద్దరి పరిస్థితి విషమం
- కాకినాడలో ప్రమాదం.. ఎక్స్‌యూవీలో మహిళ, యువకుడు క్షేమం

కాకినాడ క్రైం, జూలై 20: ఓ యువకుడు కొత్తకారు ఎక్స్‌యూవీ కొన్నాడు. ఆ సంతోషంతో ఓ మహిళతో కలసి మందు పార్టీ చేసుకున్నాడు. ఇంత వరకు అతడి వ్యక్తిగత విషయం. అక్కడితో సరిపెట్టి ఉంటే ఇద్దరి ప్రాణాలు నిలిచేవి. మరో ఇద్దరు క్షేమంగా ఉండేవారు. అయితే మద్యంమత్తులో ఆ మహిళతో కలిసి కారు నడుపుతూ రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఇద్దరి ప్రాణాలు పోవడంతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటానికి కారణమయ్యాడు. కాకినాడ నగరంలో శనివారం అర్ధరాత్రి ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక కల్పనా సెంటర్‌లో కారు అతివేగంగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు లక్ష్మణ్, సతీశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. కారు మాత్రం బోల్తాపడి అందులో ఒక పురుషుడు, మరో స్త్రీ మద్యం మత్తులో ఉన్నారు. ఇద్దరూ స్వల్పంగా గాయపడినట్టు తెలుస్తోంది. పోలీసుల కథనం ప్రకారం చల్లా రామ్మోహన్ అనే వ్యక్తి కొత్తగా మహేంద్ర ఎక్స్‌యూవీ 700 కారును కొనుగోలు చేశాడు. దానికి ఇంకా నంబరు కూడా రాలేదు. కొత్తకారు కొన్న సంతోషంలో మందు పార్టీ ఇచ్చాడు. ఓ మహిళతో కలిసి శనివారం సాయంత్రం మద్యం సేవించారు. ఈ క్రమంలో రాత్రి వాకలపూడి మీదుగా డైరీ ఫామ్ నుంచి కల్పనా వైపు వస్తూ.. ఆ సమయంలో పేర్రాజుపేటకు చెందిన లక్ష్మణ్, సతీశ్‌లు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని, ఆ వెనకనే వెళుతున్న రేచర్లపేట దుర్గాప్రసాద్, మరో వ్యక్తి యాక్టివా వాహనాన్ని ఢీకొట్టారు. అనంతరం ఎక్స్‌యూవీ 700 వాహనం డివైడర్‌పైకి దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టి బోల్తా పడింది. లక్ష్మణ్, సతీశ్ అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు కాకినాడ ఎస్‌డీపీవో డాక్టర్ హనుమంతరావు తెలిపారు. కారులో రామ్మోహన్‌తోపాటు ఉన్న మహిళ ఎవరనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఆయన చెప్పారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టళ్లలో పిల్లలు ఇబ్బందులు పడితే ఊరుకోను

- మెరుగైన సదుపాయాలు కల్పించాలి: మంత్రి సవిత



అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగినా బాధ్యులైన అధికారుల్ని ఉపేక్షించేది లేదని బీసీ సంక్షేమ, జౌళిశాఖ మంత్రి సవిత ఒక ప్రకటనలో హెచ్చరించారు. వర్షాలు పడుతుండటం, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండటంతో తక్షణమే హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, భోజనం, వసతుల విషయంలో రాజీపడకుండా చూసుకోవాలన్నారు. మన ఇంట్లో పిల్లల్ని ఏ విధంగా చూసుకుంటామో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో? హాస్టళ్లలో పిల్లల విషయంలోనూ అదే విధమైన శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే హాస్టళ్లలో పరిశీలన చేయగా చాలా చోట్ల వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

- ఎన్నికల హామీల అమలుకు చర్యలు తీసుకోండి: సీపీఐ రామకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్)/అమరావతి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతుభరోసా నిధులను విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలు సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం నుంచి విభజన హామీలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి సూచించారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదాతోపాటు విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నందున వరద బాధిత ప్రాంతాల్లో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలు నీట మునిగాయని, పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు అతలాకుతలమయ్యాయని తెలిపారు.

హరియాణాకు కేజ్రీవాల్ ఐదు గ్యారెంటీలు

- ప్రకటించిన కేజ్రీవాల్ సతీమణి



పంచకుల(హరియాణా), జూలై 20 : ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ హరియాణాలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేజ్రీవాల్ ఐదు గ్యారెంటీలను శనివారం ప్రకటించారు. బాలబాలికలకు ఉచిత విద్య అందరికీ ఉచిత వైద్యం, 24 గంటలు ఉచిత విద్యుత్తు, రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1000, యువత ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పన ఈ ఐదు గ్యారెంటీల్లో ఉన్నాయి. హరియాణా అసెంబ్లీకి ఈ ఏడాది అక్టోబరులో ఎన్నికలు జరగనున్నాయి. పంచకులలో ఈ ఐదు గ్యారెంటీల ప్రకటన కార్యక్రమానికి కేజ్రీవాల్ సతీమణితోపాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగ్వంత్ మాన్, ఆప్ సీనియర్ నేతలు సంజయ్ సింగ్, సందీప్ పాఠక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ... కేజ్రీవాల్ చేపడుతోన్న కార్యక్రమాలను చూసి ఓర్వలేకే ఆయన్ను ప్రధాని మోదీ జైలు పాలు చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్ హరియాణా బిడ్డ అని, బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకూడదని ప్రజలను కోరారు. ఇది కేజ్రీవాల్ సమస్య కాదని... హరియాణా గౌరవానికి సంబంధించిన విషయమన్నారు. తాము గెలిస్తే గృహాలకు ఉచితంగా విద్యుత్తు ఇస్తామని, 24 గంటలూ విద్యుత్తు సరఫరా ఉంటుందని చెప్పారు.

పూరీ రత్నభాండాగారంలో పురాతన ఆయుధాలు

భువనేశ్వర్, జూలై 20: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్నభాండాగారం నుంచి విలువైన వస్తువుల తరలింపు సందర్భంగా గత యుద్ధాల్లో ఉపయోగించిన కత్తులు, ఈటెలు, బరిశెలు వంటి పురాతన ఆయుధాలు బయటపడ్డాయి. లోపలి గదిలోని చెక్కపెట్టెల వద్ద ఈ ఆయుధాలు కనిపించాయని, అవన్నీ చాలా బరువుగా ఉండి నలుపు రంగులోకి మారాయని ట్రెజరీలోకి ప్రవేశించిన కమిటీ సభ్యుడు ఒకరు తెలిపారు. యుద్ధ సామగ్రిని తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచామని కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు. ఆలయ సేవకుడు శ్యామ మహాపాత్ర మాట్లాడుతూ, జగన్నాథ ఆలయంపై దుండగులు 18సార్లు దాడులు జరిపి, ఇక్కడి సంపదను దోచుకున్నారని చెప్పారు. ప్రస్తుతం లభించిన పురాతన ఆయుధాలను అప్పటి రాజులు రత్నభాండాగారంలో దాచి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

దావూద్ మాత్రమే ఉగ్రవాది.. అతని గ్యాంగ్ కాదు

ముంబయి, జూలై 20: పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు, గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంపై వ్యక్తిగత హోదాలో మాత్రమే ఉగ్రవాది అన్న ముద్ర ఉందని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. అందువల్ల అతని గ్యాంగ్‌లో ఉన్న అనుచరులను ఉపా చట్టం కింద అరెస్టు చేయలేరని తెలిపింది. ఉగ్రవాద నిరోధక చట్టం కింద అరెస్టయిన అతని అనుచరులు ఫయాజ్ భివాండీవాలా, పర్వేజ్ వైద్ అనే నిందితులకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ భారతి డాంగ్రే, ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

జీవిత భాగస్వాములను
కలిపే 'బ్రెయిన్ వేవ్'!

బ్రెయిన్ మ్యాపింగ్‌తో నేర పరిశోధన సులువు


ఏపీ న్యూరోకాన్-2024 రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ

- భవిష్యత్తులో నాడీ వైద్య రంగంలో అద్భుతాలు!
- ఏపీ న్యూరోకాన్ సదస్సులో విజయ అధ్యక్షోపన్యాసం

గుంటూరు (మెడికల్) జూలై 20: సమీప భవిష్యత్తులో న్యూరాలజీ వైద్య రంగంలో మనిషి ఊహించలేని అద్భుతాలు సృష్టించే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్ఎన్ఏ) రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి. విజయ తెలిపారు. గుంటూరులో జరుగుతున్న ఏపీ న్యూరోకాన్ 2024 రాష్ట్ర సదస్సులో శనివారం ఆమె 'బ్రెయిన్ నౌ అండ్ ఫ్యూచర్' అనే అంశంపై స్మారక అధ్యక్షోపన్యాసం చేశారు. తన ప్రసంగంలో ఆమె అనేక ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు. అవి ఇలా ఉంటాయి!

- శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమాలో హీరో చిరంజీవి, తన వైపు చూడాలంటూ మనసులో హీరోయిన్‌ను పిలుస్తాడు! ఆ మాట వినిపించినట్లుగా భ్రమపడిన హీరోయిన్ సోనాలి బింద్రే 'పిలిచావా శంకర్?' అని అడుగుతుంది. దీంతో హీరో ఉబ్బితబ్బిబ్బవుతాడు. ఇది సినిమాలో కేవలం సరదా సన్నివేశమే కావచ్చు.. కానీ సమీప భవిష్యత్తులో 'బ్రెయిన్ వేవ్ మ్యాచ్' అనే టెక్నాలజీ ద్వారా వాస్తవ రూపం దాల్చే అవకాశముంది.
- బ్రెయిన్ వేవ్ టెక్నాలజీ ద్వారా వివాహానికి ముందే యువతీ యువకులు తమ కాబోయే భాగస్వామి ఆలోచనలు, అభిరుచులు మెదడు సంకేతాల ద్వారానే తెలుసుకొని, తమ ఆలోచనకు 90 శాతం మ్యాచ్ అయ్యే వారిని పెళ్లికి ఎంచుకోవచ్చు. దాంపత్యంలో వీరి మధ్య ఎలాంటి గొడవలూ రావు!
- ఆదిత్య 369 సినిమాలో.. హీరో, ఇతర క్యారెక్టర్లు భవిష్యత్తు కాలానికి వెళతాయి. అక్కడ వారు మనస్సులో అనుకొనే మాటలు లౌడ్ స్పీకర్ ద్వారా బయటకు వినిపిస్తాయి. దీంతో వారు కంగారు పడతారు. ఇదెక్కడి దిక్కుమాలిన టెక్నాలజీ, మనస్సులో కూడా ఏమీ అనుకోకూడదా? అంటూ ఆయా క్యారెక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తాయి. ఇది సినిమాలో సరదా సన్నివేశంగా అనిపించినా.. భవిష్యత్తులో బ్రెయిన్ సంక్రోని అనే వినూత్న ప్రక్రియ ద్వారా నిజం కాబోతుంది. ముఖ్యంగా ఇది నేర పరిశోధనలో కీలక అంశంగా మారే అవకాశం ఉంటుంది.
- కోకిల సినిమాలో ఒక స్వామిజీ హత్యకు గురవుతాడు. అతడి కళ్లను హీరోకు అమరుస్తారు. దీంతో హీరోకు ఆ హంతకుడు కళ్లల్లో కనిపిస్తుంటాడు. ఇది సినిమాటిక్ సన్నివేశమే అయినా భవిష్యత్తులో బ్రెయిన్ మ్యాపింగ్ టెక్నాలజీ ద్వారా నిజమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా హత్యకు గురయ్యే వారిని పోస్టుమార్టమ్ చేసే సమయంలో వారి మెదడులోని విషయాలను బ్రెయిన్ మ్యాపింగ్ టెక్నాలజీతో డీ కోడ్ చేసి నిజమైన హంతకులను తెలుసుకోవచ్చు.
- ఇంకా భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ టెక్నాలజీ ద్వారా గాయపడిన రోగులను త్వరగా కోలుకొనేలా చేయవచ్చు. బ్రెయిన్ ఫింగర్ ప్రింట్ ద్వారా హంతకుడి మెదడులో ఆలోచనలను డీ కోడ్ చేసి హత్య చేసిన వివరాలను సులువుగా రాబట్టవచ్చు. న్యూరో జెనెటిక్స్ ద్వారా దెబ్బతిన్న మెదడు కణజాలం తిరిగి పునఃనిర్మించే అవకాశం ఉంటుంది.

మానవాళికి మేలు మలుపు

భవిష్యత్తులో న్యూరాలజీ వైద్య రంగంలో కొన్ని పరిశోధనలు మానవ జీవితాలను మలుపు తిప్పే గొప్ప ఆవిష్కరణలుగా నిలుస్తాయని డాక్టర్ విజయ వెల్లడించారు. ఈ సందర్భంగా పక్షవాతం, డిమెన్షియా, పార్కిన్‌సన్, ఫిట్స్, మైగ్రెయిన్ తదితర మెదడు సంబంధ వ్యాధుల తీవ్రత, వాటి చికిత్సలు, నివారణ వంటి అంశాలను వివరించారు. మన ఆలోచనలు మెదడును నియంత్రిస్తాయని, మెదడు నియంత్రణలో ఉంటే శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని ఆమె తెలిపారు. తన ప్రసంగం అనంతరం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ సూచనలతో హాజరైన వైద్యులందరూ స్టాండింగ్ ఒవేషన్‌తో అభినందనలు తెలిపారు. దీంతో డాక్టర్ విజయ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

దేశ వ్యాప్తంగా
కులగణన అవసరం

- కానీ సమాచారాన్ని బహిర్గతం చెయ్యకూడదు: చిరాగ్ పాశ్వాన్

న్యూఢిల్లీ, జూలై 20: దేశ వ్యాప్తంగా కులగుణన చేపట్టాల్సిన అవసరముందని కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ అభిప్రాయపడ్డారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాల రూపకల్పనలో ఈ కుల గణన ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అన్నారు. అయితే, ప్రజల్లో అసమానతలు చెలరేగే అవకాశం ఉన్న నేపథ్యంలో కులగణన వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయకూడదని సూచన చేశారు. బిహార్‌లో తాము ఇప్పటికే కుల గణన చేపట్టామని, దేశ వ్యాప్తంగా ఆ కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని పాశ్వాన్ చెప్పారు. కులాల ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అందువల్ల ఏ కులానికి చెందిన వారు ఎంతమంది ఉన్నారనే సమాచారం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.

ఏమైంది నీకు.. మతి చెడిందా?

- కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్‌పై స్పీకర్ తీవ్ర ఆగ్రహం

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలపై శాసనసభలో శనివారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్.. బీజేపీ ప్రభుత్వంలో జరిగిన పలు అవినీతి అంశాలను ప్రస్తావించారు. ఒకానొక దశలో ఆవేశానికి లోనై ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా కేకలు వేస్తూ ఊగిపోయారు. స్పీకర్ యూటీ ఖాదర్ నాలుగైదుసార్లు జోక్యం చేసుకుని అలా మాట్లాడరాదని హితవు పలికారు. అయినా ప్రదీప్ వినకపోవడంతో తీవ్రంగా మందలించారు. 'నీకు ఏమైంది, మతి చెడిందా..? ఎవరైనా అతని చేతిలో ఇనుప ముక్క పెట్టండి' (మూర్ఛ వచ్చిన వారికి ఇచ్చిన తరహాలో) అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా పట్టించుకోని ప్రదీప్ ఈశ్వర్ అలా మాట్లాడుతూనే ఉన్నారు. చీఫ్ విప్ అక్కడికి వెళ్లి నమస్కరించి మాట్లాడవద్దని సూచించారు.

కాజకు మహర్దశ..!

- ఇక్కడ హాఫ్ క్లోవర్ జంక్షన్ ఏర్పాటుకు ఎన్‌హెచ్ ప్రతిపాదన
- బెజవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు కలిసే చోటు ఇక్కడే
- ఇది ఏర్పాటైతే మంగళగిరి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి
- ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే తరహాలో బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్‌కు డిమాండ్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)


మంగళగిరి నియోజకవర్గం కాజ వద్ద విజయవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు కలిసే అలైన్‌మెంట్

అమరావతి రాజధాని ప్రాంతం మంగళగిరి నియోజకవర్గంలోని కాజకు మహర్దశ పట్టనుంది. కాజ వద్ద ఎన్‌హెచ్-16పై బెజవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు కలిసేచోట హాఫ్ క్లోవర్ జంక్షన్ ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) ప్రతిపాదన సిద్ధం చే సింది. రెండు బైపాస్‌లు ఒకే దగ్గర కలిసేచోట హాఫ్ క్లోవర్ జంక్షన్ వల్ల ఈ ప్రాంతం కొత్త రూపును సంతరించుకోనుంది. రెండు బైపాస్‌ల మీదుగా వచ్చే ట్రాఫిక్, ఎన్‌హెచ్-16 మీదుగా రాకపోకలు సాగించే ట్రాఫిక్‌కు ఎక్కడా అవాంతరాలు కలగకుండా సాఫీగా సాగిపోవడానికి ఈ హాఫ్ క్లోవర్ జంక్షన్ దోహదపడుతుంది. దీని వల్ల కాజ, మంగళగిరి ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందనుంది. ప్రస్తుతం ఆరు వరసలతో కూడిన జాతీయ రహదారిగా ఉన్న ఎన్‌హెచ్-16కు చిన్న అవుటపల్లి నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ కాజ దగ్గర అనుసంధానమవుతుంది. చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3లో 90 శాతం మేర, ప్యాకేజీ-4లో భాగంగా కృష్ణానది మీద బ్రిడ్జి, కాజ వరకు రోడ్డు పోర్షన్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. మరో ఆరు నుంచి తొమ్మిది నెలల్లో ఇది అందుబాటులోకి రానుంది. అలాగే పొట్టిపాడు నుంచి ప్రతిపాదిత తూర్పు బైపాస్ కూడా కాజ దగ్గర ఎన్‌హెచ్-16కు కలవనుంది. ఈ రెండు బైపాస్‌లూ ఆరు వరసలతో నిర్మిస్తున్న నేపథ్యంలో.. కాజ ప్రాంతంలో హాఫ్ క్లోవర్ జంక్షన్ కంటే కూడా బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్ ఏర్పాటు చేస్తే బాగుటుందనే వాదన వినిపిస్తోంది.

బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్ అయితే మేలు..

ఆరు వరసలతో కూడిన బైపాస్‌లను అనుసంధానం చేసే చోట భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్ అవసరం తప్పకుండా ఏర్పడుతుంది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి హరియాణా వరకు నిర్మించిన ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేలో ఇలాంటి బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్లు కనిపిస్తాయి. ఏపీ రాజధాని అమరావతి.. రానున్న రోజుల్లో విస్తృతమైన రోడ్ నెట్‌వర్క్‌తో అనుసంధానం కానుంది. ఏపీలోనే అత్యంత భారీ వ్యయంతో కూడిన అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు కేంద్రం పచ్చ జెండా ఊపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇన్నర్ రింగ్ రోడ్డు దిశగా కూడా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ నుంచి అమరావతికి ఆరు వరసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా.. కేంద్రం సానుకూలత తెలిపింది. బెంగళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్, నాగ్‌పూర్-విజయవాడ ఎకనమిక్ కారిడార్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇవి రెండూ కూడా అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానమవుతాయి. వీటికి తోడు విజయవాడ-ఛత్తీస్‌గఢ్ (ఎన్‌హెచ్- 30), ఖమ్మం-విజయవాడ (ఎన్‌హెచ్-216 హెచ్), కత్తిపూడి-ఒంగోలు (ఎన్‌హెచ్-216) వంటి వాటితో పాటు ప్రధానంగా ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65లు అనుసంధానమవుతాయి. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డును తలపెడితే దీని నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధాన మార్గాలు ఉంటాయి. కాబట్టి విజయవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లు అనుసంధానమయ్యేచోట హాఫ్ క్లోవర్ జంక్షన్ కంటే కూడా బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. ఎందుకంటే రాజధాని ప్రాంతం కావడం వలన భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూసేకరణ అత్యంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో ఎనిమిది వరసలుగా చేయాల్సి వచ్చినపుడు కూడా హాఫ్ క్లోవర్ జంక్షన్ సమస్య కాకుండా ఉండాలంటే.. పూర్తిస్థాయి బటర్‌ఫ్లై క్లోవర్ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్న డిమాండ్ స్థానికంగా వ్యక్తమవుతోంది. కాజ దగ్గర రెండు జాతీయ బైపాస్‌లు అనుసంధానం జరిగే చోట బటర్ ఫ్లై క్లోవర్ జంక్షన్‌ను అభివృద్ధి చేసేలా రాష్ట్రం కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

సౌదీ ఎడారిలో చిక్కుకున్న మరో తెలుగోడు

- రక్షించాలంటూ ఇసుకపూడివాసి వీడియో.. వైరల్
- స్పందించిన లోకేశ్
- రెండ్రోజుల్లో ఇంటికి చేరుస్తామని భరోసా



సోషల్ మీడియాలో ట్వీట్ చేసిన మంత్రి లోకేశ్

అంబాజీపేట, జూలై 20: ఉమ్మడి చిత్తూరు జిల్లా వాయల్పాడు మండలానికి చెందిన శివ ఏడాది దేశంలో చిక్కుకుని నరకయాతన అనుభవించి.. ఎట్టకేలకు మంత్రి లోకేశ్ చొరవతో తిరిగి స్వదేశానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరువకముందే మరో తెలుగోడు సౌదీ ఎడారిలో చిక్కుకుని అష్టకష్టాలు పడుతున్న వైనం వెలుగులోకి వచ్చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి మెరకపేటకు చెందిన సరెళ్ల వీరేంద్రకుమార్ బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి.. ఏజెంట్ మోసంతో అక్కడి ఎడారిలో చిక్కుకుని నరకయాతన పడుతున్నాడు. వీరేంద్ర వంటమనిషిగా పనిచేసేందుకు ఈ నెల 9న మధ్యవర్తులు, ఏజెంటు ద్వారా ఖత్తర్ దేశానికి వెళ్లాడు. 10న ఖత్తర్‌లో దిగిన అతడిని అక్కడి నుంచి సౌదీ అరేబియాకు పంపించారు. తీరా ఇంటిలో పనులు, వంట పనులు కాకుండా.. వీరేంద్రకుమార్‌ను ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించారు. అక్కడ ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రతల కారణంగా వీరేంద్రకు రక్తపు వాంతులబారిన పడ్డాడు. ఆ ప్రాంతంలో తాగేందుకు నీరు, ఆహారం దొరక్క నరకయాతన పడుతున్నాడు. దీంతో అతడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో నత దయనీయ స్థితిని వివరిస్తూ తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద్రకు వీరేంద్ర వాట్సాప్ ఎద్వారా వీడియో సందేశం పంపించాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు విషయాన్ని స్థానిక సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్యాబత్తుల ప్రశాంత్‌కు తెలిపారు. వారు ఈ నెల 19న అమరావతిలోని ఎన్ఆర్ టీఎస్ విభాగం (తెలుగు సొసైటీ) అధికారులకు వీరేంద్ర ఇబ్బందులను వివరిస్తూ ఫిర్యాదు చేశారు. అలాగే తల్లిదండ్రులు కుమారుడి వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. ఈ పోస్టుపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. రెండు రోజుల్లో స్వదేశానికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా వేదికగా ఆయన హామీ ఇచ్చారు. కాగా, తమను ఇబ్బందులు లేకుండా చూసుకుంటానని ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తమకుమారుడు ఇప్పుడు చావుబతుకుల్లో ఉన్నాడంటూ వీరేంద్ర తల్లిదండ్రులు సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ, తమ్ముడు రవీంద కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇల్లు కట్టి సెటిల్ అవుతానని, తమ్ముడ్ని ఉన్నత చదువులు చదివిస్తానని చెప్పాడంటూ కొడుకును తలచుకుని రోదిస్తున్నారు. వీరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను నియోజకవర్గ టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వీరేంద్రను రెండు రోజుల్లో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ మాటిచ్చారని, అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు.

చట్టప్రకారం నిర్ణయం తీసుకోండి

- నందిగం సురేష్ నివాస విషయంలో హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, ఉద్దండరాయునిపాలెం పరిధిలోని సర్వే నం. 121-1బిలోని 1.07 ఎకరాలలో అనుమతులు లేకుండా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని కూల్చివేస్తామంటూ పంచాయతీ సెక్రటరీ ఈ నెల 10న ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ దాఖలు చేసిన వ్యాజ్యం శనివారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ప్రభుత్వ న్యాయవాది దిలీప్ వాదనలు వినిపిస్తూ.. ఇంటి నిర్మాణ స్థలం తనదేనని నిరూపించుకొనేందుకు పిటిషనర్ ఎలాంటి డాక్యుమెంట్‌ను కోర్టు ముందు ఉంచలేదన్నారు. అధికారుల నోటీసులకు పిటిషనర్ వివరణ ఇచ్చారన్నారు. దానిని పరిశీలించి తుది ఉత్తర్వులు జారీ చేస్తారన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, గ్రామపంచాయతీ నోటీసుల పై అదనపు వివరాలతో అధికారులకు వివరణ ఇచ్చేందుకు పిటిషనర్‌కు రెండువారాల గడువు ఇచ్చింది. ఆ తరువాత చట్ట నిబంధనలకు లోబడి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. భవన నిర్మాణ అనుమతుల రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించింది. అధికారుల అనుమతి లేకుండా ఇకపై నిర్మాణాలను కొనసాగించవద్దని పిటిషనర్‌కు తేల్చిచెప్పింది. నోటీసుల వ్యవహారంలో ముందుకెళ్లవచ్చని అయితే పిటిషనర్ వాదనలు వినాలని పంచాయతీ అధికారులకు స్పష్టం చేసింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీకృష్ణమోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకముందు పిటిషనర్ తరపు న్యాయవాది కాసా జగన్ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... భవన నిర్మాణానికి అనుమతిస్తూ 2014లోనే పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. అయితే రాజకీయ కారణాలతో నిర్మాణానికి అవసరమైన అనుమతులు పిటిషనర్ పొందలేకపోయారన్నారు. 2019లో పంచాయతీ నుంచి భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతుల ఉత్తర్వులు పొందిన తరువాత భవన నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. కొవిడ్ కారణంగా పనులు ఆగిపోయాయన్నారు. తాజాగా ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణానికి అనుమతులు లేవంటూ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు.

'పుడా' తుది ఉత్తర్వులపై హైకోర్టుకు వైసీపీ

- కౌంటర్ దాఖలుకు అధికారులకు ఆదేశం
- వైసీపీ కార్యాలయ నిర్మాణంపై యథాతథస్థితి పాటించాలని స్పష్టీకరణ

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, లింగంగుంట్ల గ్రామం పరిధిలో ఎలాంటి అనుమతులూ లేకుండా వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయ భవనం నిర్మించారని నిర్ధారిస్తూ పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పుడా) వైస్ చైర్మన్ ఈ నెల 9న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శనివారం హైకోర్టులో విచారణకు వచ్చింది. దీనిపై పిటిషనర్ల తరఫున న్యాయవాది కాసా జగన్ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం లింగంగుంట్ల గ్రామపంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నామన్నారు. కానీ తమ వివరణను పరిగణలోకి తీసుకోకుండానే కోర్టు నిర్దేశించిన సమయం కంటే ముందుగానే పుడా తుది ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పురపాలకశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది దిలీప్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు ఏమీ తెలియని సాధారణ వ్యక్తులు కాదని, వారికి చట్టాల గురించి బాగా తెలుసని చెప్పారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైందని తెలిసి కూడా భవన నిర్మాణ అనుమతి కోసం గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేశారన్నారు. నివాసేతర భవనం విస్తీర్ణం కనీసం 300 చదరపు మీటర్లు ఉంటే అనుమతి కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకోవచ్చంటూ గతంలో ఉన్న నిబంధనను సవరిస్తూ 2017 ప్రభుత్వం జీవో 43 జారీ చేసిందన్నారు. పిటిషనర్ వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో చట్టనిబంధనల ప్రకారం తుది ఉత్తర్వులు జారీ చేశామని వివరించారు. వాదనలు నమోదు చేసిన ధర్మాసనం ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, పుడా వైస్ చైర్మన్, లింగంగుంట్ల గ్రామ పంచాయతీ సెక్రటరీతో పాటు వ్యక్తిగత హోదాలో పుడా వైస్ చైర్మన్ సాంబశివరావుకు నోటీసులు జారీ చేసింది. భవనం విషయంలో యథాతథస్థితి పాటించాలని అధికారులను ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీకృష్ణమోహన్ శనివారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

మోహిత్‌రెడ్డి కేసు వివరాలు సమర్పించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఎస్వీ యునివర్సిటీ పరిధిలో జరిగిన ఘర్షణకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో తన ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యం శనివారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చారు. ఎన్నికల సందర్భంగా ఎస్వీ యునివర్సిటీ పరిధిలో ఈ ఏడాది మే 14న చోటుచేసుకున్న ఘర్షణలో ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ చంద్రగిరి నియోజకవర్గం నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ... ఫిర్యాదులో పిటిషనర్‌పై నిర్దిష్ట ఆరోపణలు లేవన్నారు.

రేప్- హత్య కేసులో మరణశిక్షను నిలిపేసిన సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 20: యువతిపై అత్యాచారానికి పాల్పడి, ఆపై హత్య చేసిన కేసులో కింది కోర్టులు నిందితునికి విధించిన మరణ శిక్ష అమలును సుప్రీంకోర్టు నిలుపుదల చేసింది. నిందితుడు ప్రస్తుతం దాఖలు చేసిన తుది అప్పీలుపై నిర్ణయం వెలువడే వరకు స్టే ఇస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. 2016లో ఓ న్యాయ విద్యార్థి (30 ఏళ్లు)నిపై అత్యాచారం జరిపి, ఆపై హత్య చేసిన కేసులో అస్సాంకు చెందిన వలస కూలీ మహమ్మద్ అమీర్ అల్ ఇస్లాంకు ట్రయల్ కోర్టు మరణశిక్ష విధించింది. హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టులో అప్పీలు చేశాడు. పరిశీలించిన త్రిసభ్య ధర్మాసనం...జైలులో అతని ప్రవర్తన, మానసిక పరిస్థితి ఎలా ఉందో తేల్చడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని త్రిస్సూర్ ప్రభుత్వ వైద్య కళాశాలను ఆదేశించింది.


త్రిపురలోని ఓ చెక్‌పోస్టు వద్ద భారత విద్యార్థులు

బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ

- వెయ్యి మంది భారత విద్యార్థులు వెనక్కి
- చిక్కుకున్న మరో 4 వేల మంది

న్యూఢిల్లీ, జూలై 20: బంగ్లాదేశ్.. ఆందోళనలు, నిరసనలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు కల్పించిన 30 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ అక్కడి ప్రజలు చేస్తున్న పోరాటం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఆందోళనకారులు, అధికార అవామీ లీగ్ విద్యార్థి సంఘం కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. అల్లర్లలో శనివారం వరకు 115 మంది మరణించినట్లు తెలుస్తోంది. ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో షేక్ హసీనా ప్రభుత్వం శుక్రవారం అర్ధరాత్రి నుంచి దేశం మొత్తం కర్ఫ్యూ విధించింది. ఆర్మీని రంగంలోకి దించింది. అటూ బంగ్లా నుంచి శనివారం నాటికి వెయ్యి మంది భారతీయ విద్యార్థులు స్వదేశానికి వచ్చారని, మరో నాలుగు వేల మంది వివిధ వర్సిటీ హాస్టల్స్‌లో చిక్కుకుపోయారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. "విద్యార్థులు తిరిగి రావడానికి ఢాకాలోని భారత హై కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది" అని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు.